జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 5 సంచిక 122 | హైదరాబాద్, ఫిబ్రవరి 22 మంగళవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00

## అమెరికా కన్నా గొప్పగా భారత్‌ను తీర్చిదిద్దుకోవాలి



హైదరాబాద్ : బంగారు తెలంగాణ లా.. బంగారు భారతదేశం తయారు చేసుకుందామన్నారు సీఎం కేసీఆర్. నారాయణ ఖేడ్ లో సంగమేశ్వర బసమేశ్వర ఎత్తిపోతల పథాకానికి శంకుస్థాపన చేశారు కేసీఆర్. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన కేసీఆర్.. 14 ఏళ్లు కొట్లాడిన తర్వాత చివరకు దీక్ష చేపట్టి సావునోట్లకు పోయి వచ్చాక తెలంగాణ ప్రకటించారన్నారు. పట్టుబట్టి తెలంగాణను సాధించుకున్నామన్నారు. రాష్ట్రం రాకముందు ఎంతో మంది హేళనగా మాట్లాడారన్నారు కేసీఆర్.దేశంలో 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనే అన్నారు. శాశ్వతంగా మంచినీళ్ల బాధను తొలగించామన్నారు. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ టాప్ అని అన్నారు. వ్యవసాయం రంగంలో ఎన్నో మార్పులు తెచ్చామన్నారు. 4 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ప్రాజెక్టును శంకుస్థాపన చేశామన్నారు. అందరు కలిసి సంగమేశ్వర బసమేశ్వర ఎత్తిపోతల పనులను వేగవంతం చేయాలన్నారు. ఆందోళ్ నియోజవర్గం సస్యశ్యామలం కాబోతుందన్నారు. సంగారెడ్డి మెడికల్ కాలేజీకి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు కేసీఆర్.

**మండల కేంద్రంగా నిజాంపేట**

సంగారెడ్డి, జహిరాబాద్ మున్సిపాలిటీకి రూ.50 కోట్ల చొప్పున మంజూరు చేస్తామన్నారు కేసీఆర్. వీటికి సంబంధించిన జీవోను రేపే రిలీజ్ చేస్తామన్నారు. మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీలకు రూ. 25 కోట్ల చొప్పున మంజూరు చేస్తామన్నారు. సంగారెడ్డి జిల్లాలోని 699 గ్రామాలకు రూ. 20 లక్షల చొప్పున రిలీజ్ చేస్తామన్నారు. సంగారెడ్డి జిల్లాలోని అన్ని తండాలకు రోడ్లు వేయిస్తామన్నారు. నిజాంపేటను మండల కేంద్రంగా చేస్తామన్నారు. కొందరు కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గజ్వేల్, సిద్ధిపేట కన్నా ఎక్కువ నీళ్లు ఇవాళ ఆందోళ్ కు వస్తున్నాయన్నారు కేసీఆర్.

**బంగారు భారత దేశం తయారు చేద్దాం**

ఎట్లయితే తెలంగాణను బాగు చేసుకున్నామో..మన దేశాన్ని అలాగే చేసుకోవాలన్నారు కేసీఆర్. దేశరాజకీయాల్లో తాము కీలక పాత్ర పోషించబోతున్నామన్నారు . అందరు అమెరికాకు పోవడం కాదు..అమెరికా విద్యార్థులే వీసా తీసుకొని ఇండియాకు రావాలన్నారు. భారత దేశంను అమెరికా కన్నా గొప్ప దేశంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. తాను జాతీయ రాజకీయాల్లోకి పోతున్నానని.. బంగారు తెలంగాణను ఎలాగ తయారు చేసుకున్నామో.. బంగారు భారత దేశం అట్లాగే తయారు చేసుకుందామన్నారు కేసీఆర్.

## అనుబంధ సంఘాల నియామకాలు చేపట్టిన పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి...



విజయవాడ(ప్రజాపాలన ప్రతినిధి) :బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) తమ అనుబంధ సంఘాల నియామకాలను వేగవంతం చేసింది .విజయవాడ లో జరిగిన కార్యక్రమంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) నేషనల్ కన్వీనర్ కటికల శివ భాగ్య రావు బహుజన ఆధ్వర్యంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ నమ్మి అప్పారావు చేతుల మీదుగా విజయవాడ పార్లమెంటు (పార్స్) పరిధిలో వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులను మరియు మరియు సభ్యులను నియమించారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన వారికి నియామక పత్రాలను అందజేశారు. (మిగతా 2లో..)

## కేసీఆర్ ఎక్కడ అడుగు పెడితే ఆ ప్రాంతం సస్యశ్యామలం అవుతోంది: మంత్రి హరీశ్ రావు



సంగారెడ్డి : పురాణాల్లో రాముడు ఎక్కడ కాలు పెడితే అక్కడ రాయి అహల్య అయిందని.. నేడు సీఎం కేసీఆర్ ఎక్కడ అడుగు పెడితే అక్కడ ఆ ప్రాంతం సస్యశ్యామలం అవుతోందని మంత్రి హరీశ్ రావు కొనియాడారు. జిల్లాలోని నారాయణ్‌ఖేడ్‌లో సీఎం కేసీఆర్ ఇవాళ పర్యటించారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం నారాయణ్‌ఖేడ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.ఈసందర్భంగా మాట్లాడిన మంత్రి హరీశ్ రావు.. సంగారెడ్డి జిల్లా చరిత్రలోనే ఇది చిరస్థాయిగా నిలిచిపోయే కార్యక్రమం అన్నారు. సంగారెడ్డి జిల్లా అంటేనే తాగడానికి గుక్కెడు నీళ్లు లేని జిల్లా. సమైక్య రాష్ట్రంలో ఎవ్వరూ మన గురించి ఆలోచించలేదు. ఈరోజు మిషన్ భగీరథ నీళ్లు ఇంటింటికీ వస్తున్నాయి. 24 గంటల నాణ్యమైన కరెంట్ వచ్చింది. రోడ్లు వచ్చాయి. సాగునీరు కూడా ఇప్పుడు రాబోతోంది. మన గురించి సీఎం కేసీఆర్ ఆలోచించి.. (మిగతా 2లో..)

## భారత్ మాల్దీవుల మధ్య ఎయిరిండియా సేవలకు 46ఏళ్లు



ఢిల్లీ : భారత్ మాల్దీవుల మధ్య ఎయిరిండియా విమానాల రాకపోకలు ప్రారంభమై 46 ఏళ్లు పూర్తయ్యాయి. 1976 ఫిబ్రవరిలో ఎయిరిండియా తొలి ఫ్లైట్ త్రివేండ్రం నుంచి మాలేకు చేరుకుంది. నాలుగున్నర దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ప్రస్థానానికి గుర్తుగా మాలే ఎయిర్?పోర్టులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. భారత్ నుంచి మాలే ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఎయిరిండియా ఏఐ 267 విమానానికి నీటి జల్లులతో స్వాగతం పలికారు. వాటర్ కెనాన్ సెల్యూట్ కు సంబంధించి ఎయిరిండియా తన ట్విట్టర్ అకౌంట్?లో పోస్ట్ చేసిన వీడియో అందరినీ ఆకట్టుకుంటోంది.

## కార్బెవ్యాక్స్ వినియోగానికి డీసీజీఐ గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్ :హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న బయోలాజికల్ ఈ సంస్థ 12 నుంచి 18 ఏళ్ల పిల్లల కోసం మరో కరోనా టీకాను అభివృద్ధి చేసింది. కార్బెవ్యాక్స్ పేరుతో రూపొందిన ఈ వ్యాక్సిన్ అత్యవసర వినియోగానికి అనుమతి కోరుతూ ఆ సంస్థ డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ)కి దరఖాస్తు చేసింది. ఈ టీకా అత్యవసర వినియోగానికి డీసీజీఐ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయాన్ని బయోలాజికల్ ఈ లిమిటెడ్ సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. డీసీజీఐ తమ టీకాకు ఫైనల్ అప్రూవల్ ఇచ్చిందని పేర్కొంది. ఇప్పటికే టీనేజర్లకు టీకాల విషయంలో భారత్ బయోటెక్ తయారు చేసిన కొవాగ్జిన్ కు డీసీజీఐ అనుమతి లభించిన విషయం తెలిసిందే. ఇప్పుడు కార్బెవ్యాక్స్ కూ అనుమతి దక్కడంతో.. దేశంలో పిల్లల కోసం రెండు టీకాలు అందుబాటులో ఉండనున్నాయి. కాగా, భారత్ బయోటెక్ తయారు చేసిన కొవాగ్జిన్ 15 ఏళ్లు పైబడిన వారికే వ్యాక్సిన్లు అందిస్తోంది.

## లాలూ ప్రసాద్ యాదవ్ కు అస్వస్థత



ఢిల్లీ:ఆర్జేడీ నేత, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ మరోసారి అస్వస్థతకు లోనయ్యారు.దీంతో ఆయనను రాంచీలోని రాజేంద్రన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో చేర్పించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ.. ప్రమాదం ఏమీ లేదని డాక్టర్లు తెలిపారు .అంతేకాదు.. ఆయన బ్లడ్ షుగర్,రక్తపోటు హెచ్చుతగ్గులున్నాయని చెప్పారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని సమీక్షించేందుకు రిమ్స్ ఏడుగురు డాక్టర్లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. లాలూ మూత్రపిండాలతో పాటు పలు వ్యాధులతో బాధపడుతున్నారు. ఆయనకు కిడ్నీల వ్యాధి స్టేజీ-4లో ఉండగా.. 20శాతం సామర్థ్యంతో మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు డాక్టర్ విద్యాపతి తెలిపారు. దాణా కుంభకోణం కేసులో లాలూకు రాంచీ ప్రత్యేక సీబీఐ కోర్టు సోమవారం ఐదేళ్ల జైలుశిక్ష విధించడంతో పాటు.. రూ.60లక్షల జరిమానా విధించింది. ఈ నెల 15న ఈ కేసులో దోషిగా తేల్చగా.. ఇవాళ శిక్ష ఖరారు చేసింది.ఈ కేసులో మరో 46 మందికి కోర్టు మూడేళ్ల జైలు శిక్షను విధించింది. 24 మందిని నిర్దోషులుగా తేల్చింది.

## కేసీఆర్ ను కలిసిన ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్సీలు



హైదరాబాద్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీలుగా సోమవారం ప్రమాణం చేసిన అనంతరం పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, కోటిరెడ్డి, భాను ప్రసాదరావు, దండే విఠల్ లు ప్రగతి భవన్ లో సీఎం కేసిఆర్ ని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు సీఎం ఆశీర్వాదాలు తీసుకున్నారు. సీఎం ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు. తమకు ఈ అవకాశం కల్పించిన సీఎం కేసిఆర్ కి ఆ నలుగురు ఎమ్మెల్సీలు ధన్యవాదాలు తెలిపారు.



# అనుబంధ సంఘాల నియామకాలు చేపట్టిన పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి...

(మొదటి పేజీ తరువాయి)



నూతనంగా నియమితులైన అధ్యక్షులు మరియు సభ్యులను విచ్చేసిన పార్టీ అనుబంధ సభ్యులు అభినందనలు తెలియజేశారు నూతనంగా నియమితులైన సభ్యులు మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కాకుండా శక్తివంచన లేకుండా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టి అతి తక్కువ కాలంలో విజయవాడలో పార్స్ ను పార్లమెంట్ పరిధిలో అగ్రస్థానంలో ఉండేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బహుజన నాయకులు పాల్గొన్నారు.

# పార్స్ అనుబంధ ఎంప్లాయిస్ విభాగానికి సెక్రెటరీగా కూకట్లపల్లి ప్రసాద్ నియామకం



గుంటూరు ఫిబ్రవరి21 ప్రజాపాలన ప్రతినిధి : పూలే అంబేద్కర్ రాజ్యాధికారం సమితి(పార్స్) అనుబంధ ఎంప్లాయిస్ విభాగానికి సెక్రెటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్స్ నేషనల్ కన్వీనర్ డాక్టర్ కటికల శివ భాగ్య రావు బహుజన పార్స్ అనుబంధ ఎంప్లాయిస్ విభాగానికి సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాద్ , రాష్ట్రంలో అన్ని పార్లమెంట్, అసెంబ్లీ, జిల్లా, మండలాల్లో నాయకత్వాన్ని తయారు చేయాలని తద్వారా బహుజన రాజ్యాధికార ఆవశ్యకతను గుర్తించే విధంగా కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూకట్లపల్లి ప్రసాద్ నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందనలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# జై భీం నినాదాలతో దద్దరిల్లిన బెంగుళూరు





హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :గత గణతంత్ర దినోత్సవాలలో ఫోటో ని తొలగించి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ను అవమాన పరిచినందుకు రాయచూరు జిల్లా మరియు సెషన్ కోర్ట్ జడ్జ్ మల్లికార్జున గౌడ ను ఉద్యోగం నుండి తొలగించాలని బహుజనులు పెద్ద సంఖ్యలో నీలి రంగు జెండా లను చేతబూని ఛలో విధాన సౌదా,ఛలో హైకోర్టు అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వేలాది మంది బహుజనులు సెంట్రల్ రైల్వే స్టేషన్ నుండి ఫ్రీడం పార్క్ వరకు ర్యాలీ గా వెళ్లారు.ఆ పరిసరాలు మొత్తం జై భీం నినాదాలతో దద్దరిల్లాయి.





# సాంకేతిక సమస్యలు పరిష్కరించుకోవాలి

**ఎంపీ సోయం బాబూరావు**

**ప్రాజెక్టులు వినియోగించుకోవాలి**

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**




ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 21 (ప్రజాపాలన, ప్రతినిధి) : సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక ను వాడుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపు రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల లో అటల్ టింకరింగ్ ల్యాబ్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యభివృద్ధి కోసం అవసరమైన నిధులు ఇస్తుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతికతను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతను వినియోగించుకునే ఉద్దేశంతో ఏంజెల్ ప్రభుత్వం పాఠశాలలో టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తయారుచేస్తున్న ప్రాజెక్టులు నిత్య జీవితంలో వినియోగించుకోవాలని అన్నారు. అలా చేసినప్పుడే వాటికి నిజమైన ప్రయోజనం కలుగుతుందన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు సృజనాత్మకతను పెంచుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు మార్పులు అందులో జోడించే ల ప్రయత్నాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వరుణ్ రెడ్డి, జిల్లా విద్యాధికారి అశోక్, జెడ్పిటిసి అరిగెల నాగేశ్వర్ రావు, ప్రమీల, మధుకర్ లు పాల్గొన్నారు.

# మంచి నీటి సమస్యపై మంత్రి మల్లారెడ్డి కి విన్నపం



మేడిపల్లి, ఫిబ్రవరి 21 (ప్రజాపాలన ప్రతినిధి) :పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్లో అన్ని కాలనీ లలో మంచి నీటి కొరత తీవ్రంగా ఉండటంతో స్థానిక కార్పొరేటర్ లేతాకుల మాధవి రఘుపతిరెడ్డి మంత్రి మల్లారెడ్డిని కలిసి సమస్య వివరించడంతో వెంటనే స్పందించిన మంత్రివర్యులు జలమండలి ఎండి దానకిషోర్ తో మాట్లాడి సమస్య వివరించారు. అనంతరం మంత్రి సూచనతో ఖైరతాబాద్ లో ఎండిని కలిసి సమస్య వివరించడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కార్పొరేటర్ లేతాకుల మాధవి రఘుపతిరెడ్డి. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఎస్ఎన్ కాలనీ ప్రెసిడెంట్ నాగ శ్రీనివాస్, వెంకటేష్, చక్రవర్తి, డీకే ప్రధాన్, కృష్ణమూర్తి, కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, యోగి తదితరులు పాల్గొన్నారు.

# మాతృ భాషకు రాజసం!

ఎందరిని అమ్మా అని పిలిస్తే
జన్మనిచ్చిన అమ్మకు సాటిఔను!

ఎన్ని భాషలు నేర్చుకుంటే
అమ్మఒడిలో నేర్చిన అమ్మ భాషకు
అది మనకు తెలుగైనా
మరొకరికి వారిభాషలో నైనా
ఏ రాష్ట్రమైనా ఏ దేశమైనా
ఎవరి భాష వారికి తల్లిగా
ఆ భాషకు వారే బిడ్డలు కదా!

ఏదేశమేగినా ఏ బాష నేర్చినా
నీ భాష నీదిగా మాట్లాడితే,
దేశ భాషలందు తెలుగు
లెస్సయని పల్కిన రాజసం
రాజబాషగా రాజిల్లదా–అది
అధికార భాషయై విరాజిల్లదా!
ప్రజల నాల్కల నడయాడితే
అపుడే కదా భాషావైభవం!

ఎందరో సాహితీ మూర్తుల
ప్రతిభాంకితం సొగసులల్లిన
పదపదాల ప్రయోగితమై
పరిమళంచె భాష దశ దిశలా !

విస్మరించిన మాతృ భాషా
తిరోగమానానికి భాషాంతర
ప్రేమికుల వ్యామోహం
నిజంకాదా?

అది అమ్మ బడిలో అమ్మ ఒడిలో
అక్షర మార్పిడికి గురుకుటుంబలే
మూలం సాక్ష్యం మస్సాక్షిగా !

బడుగులపైనే బలవంతపు
మాతృ భాషాదోషాలు
అవి అచ్చులు దాటని
హల్లుల సరిహద్దుల్లోనే పాతాలు!

పరభాషా విధానాలనైనా
మనభాషకూ అన్వయిస్తే
జాతీయ హెూదాకేం తీసిపోక
విశ్వభాషలందు మేటియగును!

జనపదాలన్నీ జానపదులై
జనంలో నాట్యం చేస్తుంటే
అవి యాసకో పేర మాండలికమై
భాషాకోవిదుల సరికొత్త బాష్యం!

మాతృ ప్రేమకు మాతృ భాషకు
మాతృ భూమికి మాతృక
మాతృత్వపు మాధుర్యమే!

అది ప్రతి ఇంటా అడుగులేస్తూ
పలుకులౌతూ చదువులైతే
అప్పుడేకదా త్రిమాతృకాలకు
జీవనదీ జ్ఞాన ప్రవాహం!

**దాసన్నగారి కృష్ణమూర్తి**
**మహాబోధి సాహిత్య వేదిక**

# పంట కాలువలో పడిన దివ్యాంగుడు మృతదేహం లభ్యం



పి. గన్నవరం: ప్రజా పాలన ప్రతినిధి: పి.గన్నవరం మండలం లంకలగన్నవరం గ్రామంలో చింత రవి (26) అనే దివ్యాంగుడు శని వారం రాత్రి 8 గంటల సమయంలో తన మూడు చక్రాల వాహనం పై పంటకాలువ ఏటిగట్టు పై వెళుతూ అదుపుతప్పి తన మూడు చక్రాల వాహనం తో సహా పంట కాలువలో పడి గల్లంతయ్యాడు. యువకుడు కోసం వెంటనే స్థానిక యువకులు గాలింపు చర్యలు చేపట్టగా మూడు చక్రాల వాహనం మాత్రమే లభ్యమైంది. సోమవారం సాయంత్రం యువ కుడు మృతదేహం మొండెపులంక వద్ద దొరకడంతో స్థానికులు బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. దివ్యాంగుడు తండ్రి పోలీస్ స్టేషన్ కి వెళ్లి కేసు నమోదు చేయగా కానిస్టేబుల్ వచ్చి రిపోర్ట్ తీసుకుని వెళ్లాడు తప్ప యువకుడు గాలింపు చర్యల్లో పోలీసులు గానీ అధికారులు గానీ ఏ విధమైన గాలింపు చర్యలు చేపట్టలేదు. స్థానిక యువకులు బంధువులు మాత్రమే యువకుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారనివారు ఆరోపించారు.

## పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు



పొన్నూరు ఫిబ్రవరి21( ప్రజా పాలన ప్రతినిధి ) :మండలంలోని అని ్న ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు మాతృ భాష యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భాష ఉచ్చారణ రాయటం చదవటం తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మాతృభాషపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

# కేసీఆర్ ఎక్కడ అడుగు పెడితే ఆ ప్రాంతం సస్యశ్యామలం అవుతోంది: మంత్రి హరీశ్ రావు

(మొదటి పేజీ తరువాయి)

4000 కోట్ల రూపాయలతో 4 లక్షల ఎకరాలను సాగునీరు అందించే గొప్ప కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. మంజీరాలో వరద వస్తే ఆనీళ్లు వెళ్లి గోదావరిలో కలవడం మనకు తెలుసు. కానీ.. మన సీఎం గోదావరి నీళ్లను వెనక్కి మళ్లించి.. మంజీరాలో కలిపే అద్భుత కార్యక్రమాన్ని కల్పిస్తున్నారు. ఎక్కడో 90 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్న గోదావరి జలాలను మేడిగడ్డ నుంచి మల్లన్నసాగర్ కు, మల్లన్న సాగర్ నుంచి సింగూర్ కు, సింగూర్ నుంచి జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్‌కు అందించబోతున్నారు.. అని హరీశ్ రావు చెప్పుకొచ్చారు.కోటి ఎకరాల మాగాణిగా మన తెలంగాణను ఏడేండ్ల కాలంలోనే తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌ది. నేను గతంలో నారాయణఖేడ్‌లో పనిచేసినప్పుడు ఒక సామెత ఉండేది. గోరెంచకు పిల్లనియ్యొద్దు.. హద్దునూరుకు ఎద్దును ఇవ్వొద్దు అనే సామెత ఉండేది. ఇవాళ మీ దయతో మిషన్ భగీరథ నీళ్లు వచ్చాయి. దీంతో గోరెంచకు నీళ్లు వచ్చాయి. త్వరలో ఈ ప్రాజెక్టులతో హద్దునూరుకు ఎద్దు కూడా ఇస్తారు.. అంటూ మంత్రి హరీశ్ రావు వాడుకలో ఉన్న సామెతను గుర్తు చేశారు.

**చిమ్నీబాయి అప్పట్లో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసిన హరీశ్ రావు**

చిమ్నీబాయి.. కమిటి మండలంలోని సర్దార్ తండ సార్ తనది. ఒక సారి ఎన్నికల ప్రచారంలో వాళ్ల తండాకు వెళ్లా. అప్పుడు ఆమె ఏమన్నదంటే మా తండాకు ఎవ్వరూ పిల్లను ఇస్తలేరు సార్. మా తండాకు కరెంట్ లేదు. మా తండాకు రోడ్డు లేదు. మా తండాకు నీళ్లు లేవు.. అని చెప్పింది. కానీ.. ఇప్పుడు అన్నీ ఆ తండాకు ఇచ్చారు సార్. దీంతో పిలిచి పిలిచి మా తండాకు పిల్లను ఇస్తున్నార్ సార్ అని ఇటీవల ఆ తండాకు మళ్లీ వెళ్లినప్పుడు చెప్పింది.. అని మంత్రి హరీశ్ రావు గుర్తు చేశారు.ఇలా ఎన్నో కాదు..చాలా విజయగాథలు ఉన్నాయి. నారాయణ్‌ఖేడ్‌కు విద్య కోసం 8 రెసిడెన్షియల్ స్కూళ్లు, 15 సబ్‌స్టేషన్లు తెచ్చుకున్నం. మార్కెట్ యార్డులు వచ్చాయి. 54 తండాలను గ్రామపంచాయతీలుగా చేసుకున్నాం.. అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల ఛాయాచిత్ర ప్రదర్శన



హైదరాబాద్: బ్రిటిష్ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ప్రముఖ తెలంగాణ స్వాతంత్ర్య సమర యోధుల గురించి తెలుపుతూ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన రీజనల్ అవుట్ రీచ్ బ్యూరో (ఆర్.ఒ.బి.), ప్రాంతీయ పాస్ పోర్ట్ కేంద్రం సంయుక్తంగా సికింద్రాబాద్ లోని పాస్ పోర్ట్ కార్యాలయం ఆవరణలో ఛాయా చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శనను పత్రికా సమాచార కార్యాలయం (సౌత్ జోన్) డైరెక్టర్ జనరల్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ, విదేశీ వ్యవహారాల శాఖ నిర్వహిస్తున్న 'ఆజాదీకా అమృత్ మహోత్సవం' లో భాగంగా స్వాతంత్ర్య పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవడానికి ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 21 నుంచి ఫిబ్రవరి 27వ తేదీ వరకు కొనసాగుతుంది.ఈ ఎగ్జిబిషన్ లో కుమురం భీం, చాకలి ఐలమ్మ, స్వామి రామానంద తీర్థ, అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు తదితరుల స్వాతంత్ర్య సమరయోధుల వీరోచిత పోరాటల గురించి నేటి తరానికి ఈ ఛాయాచిత్రాలు క్లుప్తంగా వివరిస్తాయి. పాస్ పోర్ట్ ప్రాంతీయ కార్యాలయం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో సుమారు 42 ఛాయాచిత్రాలను సందర్శనకు ఉంచారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పాస్ పోర్ట్ కార్యాలయం డిప్యూటీ పాస్ పోర్ట్ అధికారి ఇందు భూషణ్ లెంకా, పత్రికా సమాచార కార్యాలయం అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎస్.రవీంద్ర, ఆర్ఒబి డైరెక్టర్ శృతిపాటిల్, ఆర్ఒబి అసిస్టెంట్ డైరెక్టర్ హరిబాబు, ఆర్ఒబి అసిస్టెంట్ డైరెక్టర్ భారతలక్ష్మి, ఎగ్జిబిషన్ అసిస్టెంట్ (ఇఐ) అర్ధ శ్రీనివాస్, ప్రాంతీయ పాస్ పోర్ట్ కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

**జిల్లా కలెక్టర్ భారతి హెూళ్ళికేరి**



మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి21, ప్రజాపాలన: ఇటీవల హైదరాబాద్ లోని ఎల్. బి. నగర్ స్టేడియంలో జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ ఓపెన్ టు ఆల్ కరాటే అండ్ కుంగ్ ఫూ ఛాంపియన్ షిప్–2022 పోటీలలో మంచిర్యాల వాసులు పతకాలు సాధించారని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ భారతి హెూళ్ళికేరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో ఈ పోటీలలో గెలుపొందిన వారికి పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అండర్–12 కటాఫ్ విభాగంలో జిల్లాలోని నస్పూర్ మండలానికి చెందిన జి. మైథిలి – బంగారు పతకం, బి. ఇషిత – రజత పతకం సాధించారని, 14 సంవత్సరాల కటాఫ్ విభాగంలో కె. సుచిత్ర – బంగారు పతకం, బి. సారా ఏంజిల్ – రజత పతకం సాధించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ శిక్షణ పొందిన మాస్టర్ దాసరి రాజేశ్వర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ దాసరి రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 4 నుంచి యాదాద్రీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు

యాదాద్రి: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 4 నుంచి 14వరకు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 4వ తేదీన స్వస్తివాచనం, అంకురారోపణం నిర్వహించనున్నారు. 5నుంచి 9వరకు ధ్వజరోహణం, దేవతాహ్వానం, వేదపారాయణ, హవన, అలంకార సేవలు నిర్వహించనున్నారు. 10వ తేదీన ఎదుర్కోలు, 11న లక్ష్మీ నరసింహస్వామి తిరు కల్యాణోత్సవం, 12న దివ్య విమాన రథోత్సవం, 13న పూర్ణాహుతి, చక్రతీర్థం, డోలోత్సవం నిర్వహించనున్నారు. 14వ తేదీన శతఘటాభిషేకంతో ఉత్సవసమాప్తి అవుతుంది. బ్రహ్మోత్సవాలను ఈ సంవత్సరం ఆస్థానపరంగా నిర్వహించనున్నారు. ప్రతీసారి అంగరంగ వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలను పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం దేవస్థానం నిర్వహిస్తోంది. అయితే మార్చి 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు ఆలయ ఉద్ఘాటన, మహాకుంభ సంప్రోక్షణ పూజలు నిర్వహించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఒకే నెలలో వరుస వేడుకలు నిర్వహించాల్సిన నేపథ్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలను ఆస్థానపరంగా బాలాలయ గడపలోనే నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# రసాభాసగా కొనసాగిన మండల సర్వసభ్య సమావేశం

## సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజా ప్రతినిధులు





బోనకల్, ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధి : బోనకల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కంకణాల సౌభాగ్యం అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది.ముందుగా వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు.ఎంపీపీ కంకణాల సౌభాగ్యం మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ప్రజా ప్రతినిధులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు.మండల సమావేశం కొనసాగించే క్రమంలో ఆళ్ళపాడు గ్రామ సర్పంచ్ మర్రితిరుపతిరావు, రాపల్లి సర్పంచ్ మండడపు తిరుమలరావు,వైస్ ఎంపీపీ గుగులోత్ రమేష్, గోవిందపురం(ఎల్) ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత,పెద్దబీరవల్లి ఎంపీటీసీ కర్లకుంట దేవమణి, కొంతమంది సర్పంచులు సాగర్ నీటి సమస్యపై వేదిక ముందు కూర్చొని తమ నిరసన గళాన్ని ధీటుగా వినిపించారు. ఎన్ఎస్ పి అధికారులు తక్షణమే సమావేశంలో రైతులకు వారబందీ షరతులు లేకుండా,రైతులకు పూర్తిస్థాయిలో నీటిని కొనసాగిస్తానని పూర్తి హామీ ఇవ్వాలని కోరారు. ఫోన్ ద్వారా ఎన్ ఎస్ పి ఈ ఈ మాట్లాడుతూ నీటి కొరత ఏర్పడ్డానికి సిబ్బంది కొరత,రెగ్యులేషన్ ,ఉన్నందువల్లనే ఈ సమస్యలు ఏర్పడుతున్నాయనీ లేకుండా చేస్తామని ఆయన వారికి తెలియజేశారు. అలాగే గోవిందపురం సహకార సంఘం సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రం మాట్లాడుతూ కలకోట మేయర్ పై ఉన్న పలు సమస్యలపై అధికారులకు చెప్పిన వినిపించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.మండల ప్రధాన వైద్యులు డాక్టర్ తాటికొండ శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో పాజిటివ్ కేసుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, గతంలో మండల వ్యాప్తంగా గర్భిణీలు 80% ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లేవారని 20% మాత్రమే ప్రభుత్వహాస్పిటల్ కి వచ్చేవారని కాని ప్రస్తుతం 60% ప్రభుత్వ ఆసుపత్రుల వైపు ప్రజలు వస్తున్నారని 40 % ప్రజలు మాత్రమే ప్రైవేట్ హాస్పిటల్ కి వెళుతున్నారని ,మండలంలో ఆళ్ళపాడు సర్పంచ్ మర్రి తిరుపతిరావు స్వయంగా తన కుమార్తెను ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి డెలివరీ చేయించి తమ గ్రామ ప్రజలకు,మండల ప్రజలకు ఆదర్శంగా నిలిచారని డాక్టర్ శ్రీకాంత్ సర్పంచ్ ని అభినందించారు. సర్పంచులు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన తీసుకురావాలని ప్రభుత్వ ఆసుపత్రుల వైపు మొగ్గు చూపే విధంగా వారినీ చైతన్య పరచాలని కోరారు. మండలంలో 12 పడకల ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా మార్చే విధంగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రభుత్వం ఆశాలకు అందిస్తున్న మొబైల్స్ ను మండలంలోని పలువురు సర్పంచులు చేతుల మీదగా వారికి పంపిణీ చేశారు. విద్యుత్ శాఖపై ఏఈ మాట్లాడుతుండగా, గోవిందపురం ఎల్ సర్పంచి ఉమ్మినేని బాబు మాట్లాడుతూ తమ గ్రామంలోని ఒక పేద కుటుంబం ఒక చిన్న రేకుల షెడ్డు వేసుకోవడానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరినా విద్యుత్ అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో సామాన్యులపై అధిక విద్యుత్ బిల్లులు వస్తున్నాయని సర్పంచులు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎంపీపీ కంకణాల సౌభాగ్యం మాట్లాడుతూ సామాన్యుడిపై అధిక విద్యుత్ బిల్లులు ఎందుకు వస్తున్నాయో విద్యుత్ అధికారుల తెలియజేయాలని అన్నారు. వ్యవసాయ శాఖ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 14 రైతు కలలను నిర్మించామని, గతంలో 10 ఎకరాలు ఉంటే రైతు కల్లలకు అనుమతి ఇచ్చామని, ఇప్పుడు దానిని ఐదెకరాల లోపు వరకు మాత్రమే కుదించారని వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేశారు. అనంతరం ఆర్అండ్ బీ శాఖ అధికారులు మాట్లాడుతుండగా ఎంపీపీ మండలంలో ఆర్అండ్ బీ శాఖల పనితీరును తీవ్రంగా ఖండించారు. అనంతరం ప్రజా పంపిణీ వ్యవస్థ పై పలువురు సర్పంచులు నూతన రేషన్ కార్డుల, కొత్త పాన్ బుక్ ప్రింటింగ్ ఆలస్యమవుతుందని వాటిని కూడా త్వరగా పంపిణీ చేయాలని సర్పంచులు కోరారు గోవిందపురం ఏ సర్పంచ్ భాగం శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో పలు సమస్యలపై అధికారులకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈసమావేశంలో ఎంపీడీవో గొట్టిపాటి శ్రీదేవి,డిటి శ్వేత, సర్పంచ్లు మర్రితిరుపతిరావు, మందాడపు తిరుమలరావు,భాగం శ్రీనివాసరావు,యంగాల దయామణి,నోముల వెంకట నరసమ్మ, ఆళ్ళ పుల్లమ్మ,ఎంపీటీసీలు జొన్నలగడ్డ సునీత ,కర్లకుంటదేవమణి ,కందిమల్ల రాధా,పారా శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పార్స్ ఎన్జీవోస్ విభాగానికి స్టేట్ సెక్రటరీగా పిల్లి రాజు నియామకం



గుంటూరు ఫిబ్రవరి21 ప్రజాపాలన ప్రతినిధి : పూలే అంబేద్కర్ రాజ్యాధికారం సమితి(పార్స్) అనుబంధ విభాగమైనఎన్జీవోస్ విభాగానికి పిల్లి రాజు స్టేట్ సెక్రటరీ గా నియమితులయ్యారు. ఈ మేరకు పార్స్ నేషనల్ కన్వీనర్ డాక్టర్ కటికల శివ భాగ్య రావు బహుజన పార్స్ అనుబంధ విభాగమైన ఎన్జీవోస్ విభాగానికి కి స్టేట్ సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పిల్లి రాజు, రాష్ట్రంలో అన్ని పార్లమెంట్, అసెంబ్లీ, జిల్లా, మండలాల్లో నాయకత్వాన్ని బలోపేతం చేయాలని తద్వారా బహుజన రాజ్యాధికార ఆవశ్యకతను గుర్తించే విధంగా కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పిల్లి రాజు నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందనలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# ఇళ్లలోకి నీళ్లు రాకుండా చూడండని గ్రామస్తుల ఆవేదన




బోనకల్, ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని గోవిందాపురం ఎ గ్రామంలో యస్ సి కాలనీలోకి దేవుడి మాన్యం నుండి యన్. యస్.పి కాలువ నీళ్లు ఇంటిలోకి వస్తున్నాయని,ఇలా రావడం వల్ల ఇంటి ఆవరణంలోకి నీరు చేరి ఇంటి పరిసరాలు పాకుడు పడుతున్నాయని, ఇంకుడు గుంతలు నిండిపోతున్నాయని కాలనీ వాసులు సర్పంచ్ భాగం శ్రీనివాసరావు కి తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండోమెంట్ అధికారులు స్పందించి కాలువ నీళ్లు ఇళ్లలోకి రాకుండా ఆ కాలువను వేరేవైపు మరలిస్తే నీళ్లు ఇళ్లలోకి చేరవని తెలిపారు.ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గతంలో ఈ సమస్య గురించి అధికారులను తెలిపామని,ఇంత వరకు ఏమి పరిష్కారం చేయలేదని, మాకైనా హద్దులు చూపితే కాలువ తీసి మేమే ఆ నీళ్లు చెరువుకు వెళ్లేలా చూసుకుంటామని సర్పంచ్ బాగం శ్రీను వాసరావు అధికారులను కోరారు.

# బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయికి ఎంపికైన ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రీడాకారులు




బోనకల్ ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధి: 66వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల ఫిబ్రవరి 24 నుండి 28 వరకు తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్ నందు జరుగు పోటీల్లో పాల్గొంటారు. ఈ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన బోనకల్ గ్రామానికి చెందిన నునావత్ గోపి, అమరేష్ మనోజ్ కుమార్ (బోనకల్) పిల్లలమర్రి శ్రీ చందన (ఖమ్మం) బి సహస్ర (ముష్టికుంట్ల) వీరందరూ ఈసీఐఎల్ డాక్టర్ ఏఎస్ రావు నగర్ హైదరాబాద్ నందు జరిగిన ప్రాబుల్ క్యాంప్ నందు బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఈ జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు, బాల్ బ్యాడ్మింటన్ కోచ్ అమరేశి లింగయ్య కు ఖమ్మం జిల్లా బాల్బ్యాడ్మింటన్ అసోసియేషన్, బోనకల్ మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, మండల ప్రజలు వీరికి అభినందనలు తెలిపారు.

# రీడ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి: సీఎంఓ రాజశేఖర్



బోనకల్, ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధి: జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ సీఎంఓ యలగందుల రాజశేఖర్ మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. మాతృ భాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వక్తృత్వ పోటీలను పరిశీలించారు. రీడ్ కార్యక్రమం అమలు తీరు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని విద్యార్థులను పరీక్షించారు. ప్రతి విద్యార్థి అనర్గళంగా చదివేలా ఉపాధ్యాయులు తగు ప్రణాళికలను రూపొందించుకొని పాఠశాలలో సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామములో త్రీఫేస్ కరెంట్ ఉండేలా చూడాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 21 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లాలోని ప్రతి గ్రామంలో త్రీఫేస్ కరెంట్ అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ, విద్యుత్, గిరిజన, సంక్షేమ శాఖ, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో త్రీఫేస్ కరెంట్ అందించాలని, దీనికోసం ఇప్పటికే పనులు ప్రారంభించాలని అన్నారు. కొన్ని చోట్ల అనుమతులు అవసరం ఉందని, విశాఖ తో విద్యుత్ అధికారులసమన్యాయంతో అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేయాలన్నారు.గిరిజన సంక్షేమ శాఖ సహాయం కూడా తీసుకోవాలని, జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల 56 పెండింగ్ పనులు ఉన్నాయని, విద్యుత్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వీటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గిరి గ్రామాలకు విద్యుత్ సౌకర్యం అందించాలని, కోతలు లేని విద్యుత్ ప్రజలకు అందించేలా చూడాలన్నారు. పనులలో జాప్యం జరగకుండా చూడాలని, రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యుత్ మార్పిడి పనులు జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వరుణ్ రెడ్డి,జిల్లా అటవీ శాఖ అధికారి శాంతారాం, గిరిజన సంక్షేమ శాఖ అధికారిని మణెమ్మ, విద్యుత్ డి ఈ రాజన్న, శ్రీనివాస్,రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో దళిత బంధు అమలు చేయాలి



జన్నారం రూరల్, ఫిబ్రవరి 21, ప్రజా పాలన : మండలంలో దళిత బందు పథకం అమలు చేసి దళితులందరికీ వర్తింప జేయాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. దళిత సామాజిక వర్గం ఆర్థికంగా నిలదొక్కుకోవాలని తీసుకచ్చిన ఈ పథకం టిఆర్ఎస్ పార్టీలో ఉన్న దళితులకు మాత్రమే వర్తించేలా నాయకులు, అధికారులు వ్యవహారించడం దురదృష్టం అని అన్నారు. ఒక వర్గం ప్రయోజనం కోసం తెచ్చిన సంక్షేమ పథకాల ద్వారా రాజకీయ పార్టీ కార్యకర్తలు, నాయకులు మాత్రమే ప్రయోజనం పొందుతే సరిపోదని అన్నారు. దళిత బహుజన వర్గాలను ఓటర్లు గా మాత్రమే చూసే ఆలోచన మానుకోవాలని హితవుపలికారు. మండలం లోని అర్హులైన దళిత పేదలకు అందరికీ వర్తింపజేయాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీరాజం, ఇంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బస్సు కారు ఢీ.. త్రుటిలో తప్పిన ప్రమాదం



బోనకల్ ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధి: బోనకల్ మండల ప్రధాన కేంద్రం లోని ఖమ్మం బస్టాండ్ సెంటర్ వద్ద ఎస్బిఐ బ్యాంక్ ఎదురుగా మూలమలుపు వద్ద సోమవారం ఉదయం ఖమ్మం నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న కారు ఒకదానికి మరొకటి ఢీకొన్నాయి.రోడ్డుకిరువైపులా షాపులు రోడ్డుపైకి రావడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకోవడానికి మార్గం లేకపోవడంతో ఒకదానికి మరొకటి ఢీకొన్న ట్లు ఘటన చూసిన ప్రయాణికులు తెలియజేశారు.అంతేకాక ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపై నిలబడాల్సి వస్తుందని, వ్యాపారస్తులు తమ షాపులు రోడ్డుపై పెట్టడం వలన పలువురు ప్రయాణికులకు చాలా ఇబ్బందిగా ఉందని వారు తెలియజేశారు.


మాస్టర్ కీ TV
(అంబేద్కర్ TV)

జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?

అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్ధే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేద్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,

Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004

E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 22, ఫిబ్రవరి 2022

# మెతుకు సీమలో కొత్త చరిత్ర

వెయ్యి ఏండ్ల కింద దక్కన్ పీఠభూమిలో ఎగసిపడిన సామాజిక కెరటం బసవేశ్వరుడు. అది కర్ణాటక ప్రాంతం కావడంతో దానికి ఆనుకుని ఉన్న ఆ ప్రాంతమంతా ఆ చైతన్య ఒరవడి పరంపర కొనసాగింది. సరిగ్గా వెయ్యి ఏండ్ల తర్వాత అదే ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ ఈ మూడు నియోజకవర్గాలు అపర భగీరథుడు గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో జల చైతన్యాన్ని పొందుతున్నాయి. బసవేశ్వర సంగమేశ్వర జలధారలే దీనికి సజీవ సాక్ష్యాలై నిలుస్తున్నాయి. నాటి నిజాం రాజ్యం, నేడు ప్రత్యేక స్వయంపాలిత రాష్ట్రంలో అత్యంత వెనకబడిన పై మూడు నియోజకవర్గాల్లో మంజీర జలాలు ఆర్థిక వనరుల కొత్తజీవితపు రంగుల వసంతపు తరంగాన్ని తీసుకురానున్నాయి. 2014 తర్వాత ప్రత్యేక తెలంగాణలో తనదైన ముద్రతో సరికొత్త జల వ్యూహాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం రచించుకున్నది. దాని ప్రతిఫలంగానే సంగమేశ్వర, బసవేశ్వర పురుడోసుకున్నాయి. గత పాలకులకు ఈ ప్రాంతం గురించి పట్టింపులేదు. చెంతనే నిండుకుండలా సింగూరు జలాలు కనిపించినా గుక్కెడు నీళ్లకోసం కిలోమీటర్ల పాదయాత్ర పొద్దు-మాపు అమ్మలకు, అక్కలకు తప్పేది కాదు. వేల ఎకరాల భూములు, వందల గ్రామాలు ప్రాజెక్ట్ కోసం త్యాగం చేస్తే ఈ ప్రాంత ప్రజలకు చుక్కనీరు అందలేదు. మేడి, కాడీ సంపూర్ణ జలాలను ఆస్వాదించిన సందర్భం ఈ ప్రాంత చరిత్రలోనే లేదు. సింగూరు నీళ్లతో జీవితాల్లో మార్పు వస్తుందని ఆశించిన ఇక్కడి ప్రజల కల నెరవేరకపోవడంతో వేలమంది హైదరాబాద్‌కు లేదా ముంబైకి వలస వెళ్లారు. పండగలకు పబ్బాలకు తప్పించి గ్రామాలకు రానివారు వేలల్లో ఉన్నారంటే ఎంతమంది వలసవెళ్లారో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికలప్పుడు హైదరాబాద్ నుంచి 30 వేలకు పైగా జనం ఓట్లు వేయడానికే వచ్చి పోయేవారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు చరిత్ర పునఃలిఖించడం మొదలైంది. ఇందుకు ఆధారం సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టులు. ఈ ప్రాజెక్ట్ కింద 2.19 లక్షల ఎకరాలకు సాగునీరు రాబోతున్నది. అందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలు గణనీయ అభివృద్ధిని సాధించబోతున్నాయి. భవిష్యత్తులో ఈ ప్రాంతం కోనసీమను తలదన్నే రీతిలో విరాజిల్లబోతున్నది. ముందు చెప్పినట్టు బతుకు దెరువు కోసమై ముంబై, హైదరాబాద్ లాంటి నగరాలకు వలసవెలుతున్న ప్రజలకు సంగమేశ్వర, బసవేశ్వర ఉజ్వల భవిష్యత్తును ఇవ్వబోతున్నాయి. సంకల్పం, కార్యసాధన, స్వయం పాలనకు సంపూర్ణ నిర్వచనం కేసీఆర్. దానికి ప్రతిబింబమే ఈ ఎత్తిపోతల. ఇది ఈ ప్రాంత వాసుల కష్టాలను, కన్నీళ్ళను ఎత్తివేసి, సిరులను, సుఖ సంతోషాలను దరి చేర్చబోతున్నది. ఈ ప్రాంత కరువు, వలసల జీవన స్థితి గతులు ప్రధాన వార్తలు. రాబోయే రోజులలో దీనికి భిన్నమైన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక ఉత్తేజిత పురోభివృద్ధి దృక్కోణాలు ప్రధాన స్రవంతిలో పతాక స్థాయిని అందుకుంటాయని అనడంలో సందేహం లేదు. ప్రఖ్యాత కవిపండితులు పంపన, మల్లినాథ సూరి, సామాజిక కవి పండితులు పోతనా మాత్యులు విశ్వసించిన సమదృష్టి చరిత్ర సంగారెడ్డి జిల్లాలో సగర్వంగా పచ్చని పంట పొలాలై, నీటి తెమ్మరులై, పసిడికాంతుల వరి వెన్నులై, చిరుధాన్యాల నాణ్యతకు అంతులేని నిధులై, సంగమేశ్వర జలపాతమై ఈ ప్రాంత జనవాహినిని పునీతం చేయబోతున్నది. దృఢ సంకల్పుడు, భరత జాతి ముద్దుబిడ్డ కేసీఆర్ సీఎం అయ్యాక కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు, ఈశాన్యం నుంచి అరేబియా సముద్రం వరకు కనీవినీ ఎరుగని రీతిలో ప్రజోపయోగ పనులు చేస్తూ ఖ్యాతినొందారు. ఈ ఆధునిక కథానాయకుడే మెతుకు ప్రాంతంపై అపారమైన కరుణార్ద్ర హృదయంతో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతలను ఈ ప్రాంతవాసులకు అంకితమిస్తున్నారు. రాళ్లు రప్పలతో గట్టు ప్రాంతంగా ఉండే మా చేలలో నీళ్లు చూడాలని తహతహలాడుతున్న నాలాంటి ఈ ప్రాంత బిడ్డల ఆశ నెరవేరబోతున్నందుకు పట్టరాని సంతోషంగా ఉన్నది. అంతేకాదు.. ఈ ప్రాంత బిడ్డగా.. మొట్టమొదటిసారి అందోల్‌లో స్థానికుడిని ఎమ్మెల్యేగా గెలిపించిన తర్వాత.. నా హయాంలో ఈ ప్రాజెక్టు రావడం అనేది నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. పలనాడు సీమలోని కరువు కాటకాలు చుక్కనీరులేక అల్లాడుతున్న జనాన్ని చూసి ప్రఖ్యాత తెలుగు కవి పండితులు శ్రీనాథుడు 'తిరిపమున కిద్దరాంఢ్రా పరమేశా.. గంగవిడుము పార్వతిచాలున్' అని చాటు పద్యాల రూపంలో తన వేదనను వ్యక్తం చేశారు. నాటికీ నేటికీ పలనాడు అలాగే ఉన్నది. రతనాల సీమ రాయలసీమపై ప్రముఖ కవి విద్వాన్ విశ్వం పెన్నానదిని తలపోస్తూ చుక్కనీరు లేక వలపోస్తున్నామని తన గోసను వెళ్ళగక్కారు. ఒకటీ అరా మినహా అక్కడా అదే స్థితి. కానీ, తెలంగాణ కేసీఆర్ పాలనలో తద్భిన్నమని నిరూపించుకున్నది. ఇంతటి నిష్టాగరిష్ఠుడు సాక్షాత్తు పరమేశ్వర స్వరూప అపర భగీరథుడైన ముఖ్యమంత్రి కేసీఆర్ తానున్నట్లు భరోసానిస్తూ సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతలను అత్యంత వెనుకబడిన అశేష జనవాహినికి అంకితమిస్తున్న చారిత్రక సందర్భమిది. వందల ఏండ్లుగా కన్నీళ్లు, కరువు కాటకాల ధాటికి విలవిలలాడిన జన సమూహం పక్షాన మీకు వినమ్ర నమస్సుమాంజలులు.

# మన రాజ్యాంగానికి కొత్త ప్రమాదం




భారత ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి చేసే ఏ ప్రయత్నమైనా ప్రమాదకరమే. అణచివేతకు గురైన, పీడిత వర్గాల ప్రజలు ఇంతకాలం పొందుతున్న సంక్షేమ పథకాలన్నింటినీ దీంతో కోల్పోతారు. కులవ్యవస్థ, అంటరానితనం, ఆదిమతత్వం కారణంగానే భారతదేశంలో 1950కి ముందు సార్వత్రిక విద్య అనే భావనే ఉనికిలో లేదు. ప్రస్తుత రాజ్యాంగాన్ని అమలుపరచడం వల్లే పీడిత ప్రజలు అంతవరకు తమకు తెలీని ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకున్నారు. కాబట్టి ఏ రాజకీయ, సైద్ధాంతిక భావజాలం ఉన్న నాయకులైనా సరే... ఈ రాజ్యాంగాన్ని వెనక్కు నెట్టడాన్ని మనం ఎన్నటికీ అనుమతించకూడదు. భారత రాజ్యాంగం నిరవధికంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు రెండు వ్యతిరేక రంగాల్లో పోరాటాన్ని ప్రారంభించారు. ఒకటి: బీజేపీ గద్దె దిగేంత వరకూ వారితో పోరా డుతూ ఉంటానన్నారు. రెండు: ఆరెస్సెస్, బీజేపీ వ్యతిరేకించిన 1950 నాటి రాజ్యాంగం స్థానంలో కొత్త రాజ్యాంగాన్ని ఆయన కోరు కున్నారు. పూర్తిగా విరుద్ధమైన రెండు యుద్ధరంగాలను అయన ఏక కాలంలో ఎందుకు ప్రారంభించినట్లు అనేది అసలు ప్రశ్న. ఆర్ఎస్ఎస్ మూలాలు సనాతన బ్రాహ్మణవాద ఆధ్యాత్మిక వ్యవస్థలో పాతుకుని ఉన్నాయి కాబట్టి దాన్నుంచి భారత రాజ్యాం గానికి ప్రమాదం ఉండేదనీ, ఇప్పటికీ ఉంటోందనీ మనకు తెలుసు. డాక్టర్ అంబేడ్కర్ నేతృత్వంలోని డ్రాఫ్ట్ కమిటీ ముసాయిదా రచనా ప్రక్రియను రూపొందించడం ప్రారంభించినప్పటి నుంచి కూడా ఆరెస్సెస్ సిద్ధాంతకర్తలు, దాని సంస్థాపక నాయకులు... రాజ్యాంగ సభ భావనను అంగీకరించేవారు కాదు. భారతీయతపై వారి భావన కానీ, వారు సమ్మతిస్తున్న తరహా రాజ్యాంగం కానీ... వర్ణ కుల వ్యవస్థను బలపరుస్తాయి. భారతీయ కమ్యూనిస్టులు కూడా రాజ్యాంగసభ ఏర్పాటును తోసిపుచ్చి ప్రజాస్వామిక రాజ్యాంగ ముసాయిదాను వ్యతిరేకించడానికి ప్రయత్నించారు. అది ఒక బూర్జువా రాజ్యాంగ రచనకు ప్రయత్నమని వారి భావం. అదృష్ట వశాత్తూ వీరు కూడా తమ ప్రయత్నంలో విఫలమయ్యారు. చివరకు 1950 జనవరి 26న ప్రస్తుత రాజ్యాంగం ఉనికిలోకి వచ్చింది. రాజ్యాంగంలోని కొన్ని సెక్షన్లను మాత్రమే కాకుండా మొత్తం రాజ్యాంగాన్నే సమీక్షించడానికి అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వం లోని నాటి బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం జస్టిస్ వెంకటాచలయ్య నేతృత్వంలో ఒక సమీక్షా కమిటీని ఏర్పర్చింది. కేవలం రాజ్యాంగాన్ని సవరించడం కాకుండా మారుతున్న సమాజ అవసరాలకు అను గుణంగా దాన్ని మార్చాలన్నదే నాటి ప్రభుత్వ ఉద్దేశం. కానీ ఆ ప్రయ త్నాన్ని దేశంలోని పలు వర్గాల ప్రజలు తిరస్కరించారు. దీంతో రాజ్యాంగ సమీక్షా కమిటీ సహజంగానే మరుగున పడిపోయింది.

తగని వైఖరి

ఒక ప్రాంతీయ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి అయిన కె. చంద్రశేఖర రావు కేంద్ర బడ్జెట్ గురించి ఫిబ్రవరి 1న మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను మాత్రమే కాకుండా ప్రస్తుత రాజ్యాంగాన్ని కూడా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కొందరు మీడియా వ్యక్తులు దీన్ని పెద్దగా పట్టించుకోనప్పుడు, ఈ అంశంపై తాను చాలా సీరియస్‌గా ఉన్నట్లు నొక్కి చెప్పారు. 'మొత్తం రాజ్యాంగాన్ని మార్చడంపై చర్చిద్దాం. మనకు ఇప్పుడు కొత్త రాజ్యాంగం కావాలి' అన్నారు. ఒక చిన్న ప్రాంతీయ పార్టీ నేతకు దేశానికి కొత్త రాజ్యాంగం కావాలి అనే ప్లాన్ ఉంటే దాన్ని ఎవరైనా పట్టించుకోవలసిన అవసరం లేదు. కానీ ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి దీని గురించి మాట్లాడటమే కలవరపెడుతోంది. వాస్తవానికి కేసీఆర్‌లో అనేక రకాలుగా హిందుత్వ ఆలోచనా విధానం గూడుకట్టుకుని ఉంది. స్వతహాగా ఆయన మతావేశపరుడు. యాగాలు, యజ్ఞాలు, క్రతువులు, ఆలయాలపై మెండుగా ఖర్చు పెడ తారు. వైష్ణవ పీఠాధిపతి చిన జీయర్‌ని సకల వేళల్లో అనుసరిస్తారు. యాదగిరి ఆలయ పునరుద్ధరణకు రూ. 130 కోట్లు ఖర్చు పెట్టారు. పూర్తిగా మతపరమైన విశ్వాసాలతో కూడిన వ్యక్తిత్వం కాబట్టే ఇలా రాజ్యాంగ వ్యతిరేక ప్రకటనలకు కేసీఆర్ పాల్పడు తున్నారు. బీజేపీపై కేసీఆర్ చేస్తున్న పెనుదాడి తెలంగాణ మనోభావాలను తిరిగి ప్రేరేపిస్తుంది కాబట్టి ఇది ఆయనకు లబ్ధి చేకూర్చవచ్చు. కానీ ఆయన ప్రదర్శిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక వైఖరి అటు తెలంగాణ ప్రజలకు గానీ, ఇటు తన సొంత ప్రయోజనానికి గానీ ఏమాత్రం సమ్మతమైనది కాదు. ఎందుకంటే రాజ్యాంగం పట్ల వ్యతిరేకత అనేది నేరుగా ఆరెస్సెస్, బీజేపీతో ముడిపడి ఉన్న విషయం. ఇలాంటి పాలకులను, వ్యక్తులను సంస్కరించడమే భారత రాజ్యాంగ విధి. ఒక వ్యక్తిగా ఇలాంటి అభిప్రాయాలు కలిగి ఉండే హక్కు కేసీఆర్‌కు లేదని చెప్పలేం. కానీ రాజ్యాంగం ముందు ప్రమాణం చేసి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి అదే రాజ్యాంగాన్ని మార్చడానికి ఉద్యమాన్ని ప్రారంభించకూడదు. భారత స్వాతంత్ర్యం కోసం మన దేశ నిర్మాతలు సంవత్సరాల కొద్దీ జైళ్లలో గడిపారు. వారు రాజ్యాంగ ముసాయిదాను రచించిన రాజ్యాంగ సభలో భాగమయ్యారు. దేశం చారిత్రకంగా ఎదుర్కొన్న ప్రతి కీలక సమస్యపై సుదీర్ఘ చర్చ జరిపిన తర్వాతే వీరు రాజ్యాంగ ముసాయిదాను రచించారు. ఇన్నేళ్ల తర్వాత ప్రతి ముఖ్యమంత్రీ లేక మంత్రీ, దేశానికి సర్వశక్తులూ కల్పించిన భారత రాజ్యాంగాన్నే రద్దు చేయాలని మాట్లాడితే దేశం కల్లోలంలో కూరుకుపోక తప్పదు. రేపు ప్రధానమంత్రి, ఆయన మంత్రివర్గ సభ్యులు కూడా ప్రజాస్వామిక వ్యవస్థను సంస్థాగతం చేసిన రాజ్యాంగాన్ని త్యజించడం లేదా రద్దు చేయడం గురించి మాట్లాడటం మొదలెడితే, భారతదేశం ధ్వంసమై పోతుంది. ప్రస్తుత పాలకులను నాటి స్వాతంత్ర్య వీరులు, వారి త్యాగాలతో ఏమాత్రం సరిపోల్చలేమనే చెప్పాలి.

**గణరాజ్య వ్యవస్థ ఆచరణీయమేనా?**

మరో సందర్భంలో ఆరెస్సెస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్, ప్రాచీన గణరాజ్య వ్యవస్థలో ఉత్తమమైన ప్రజాస్వామ్యం ఉండేదని సూచించారు. ఇది జాతీయవాద ప్రచారంలో బాగా వ్యాప్తిలో ఉన్న కొత్త భ్రమ మాత్రమే. పైగా మనది వలసవాద రాజ్యాంగ నమూనా అంటూ చాలాసార్లు పరోక్షంగా వ్యాఖ్యానాలు చేశారు. ప్రాచీన గణ రాజ్యాలు చిన్న చిన్న గిరిజన విభాగాలు. స్థానిక విభాగాల స్థాయిలో గిరిజన సమానత్వ పంపిణీ పద్ధతిలో నడిచేవి. దీనికి చక్కటి ఉదా హరణ వజ్జియన్ గిరిజన గణరాజ్య ప్రజాస్వామ్యం. బుద్ధుడి జీవిత కాలంలోనే ఇది ఉనికిలో ఉండేది. మగధ రాజ్య ఆక్రమణ నుంచి బుద్ధుడు దీన్ని కాపాడాడు. ఇలాంటి గణరాజ్య ప్రజాస్వామ్యాన్ని ఆధునిక భారత రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని ఏ రకంగానూ పోల్చి చూడలేం (నా పుస్తకం 'గాడ్ యాజ్ పొలిటికల్ ఫిలాసఫర్ – బుద్ధాస్ ఛాలెంజ్ టు బ్రాహ్మిణిజం'లో నేను గతంలోనే దీన్ని చర్చించాను). మన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని ప్రయోగమని చెప్పాలి. పైగా జనాభా అధికంగా ఉన్న ప్రపంచంలోని ఏ దేశంలో కూడా ఇంతటి బృహత్తర రాజ్యాంగం ఉనికిలో లేదు. ఇటువంటి ప్రజాస్వామ్యాన్ని రద్దు చేయడానికి చేసే ఏ ప్రయత్నమైనా ప్రమాదకరమే. అణచివేతకు గురైన, పీడిత వర్గాల ప్రజలు ఇంత కాలం పొందుతున్న సంక్షేమ పథకాలన్నింటినీ దీంతో కోల్పోతారు. కుల వ్యవస్థ, అంటరానితనం, ఆదిమతత్వం కారణంగానే భారత దేశంలో 1950కి ముందు సార్వత్రిక విద్య అనే భావనే ఉనికిలో లేదు. ప్రస్తుత రాజ్యాంగాన్ని అమలుపరచడం వల్లే పీడిత ప్రజలు అంతవరకు తమకు తెలీని ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలో భారత రాజ్యాంగ ముసాయిదా పూర్తి కావడం, దాన్ని మన దేశ నిర్మాతలు ఆమోదించినందుకు మనం ఎంతో అదృష్టవంతులం. కేసీఆర్ వంటి అధికార తృష్ణ కలిగిన నేతలు, హిందుత్వ భావజాలం ప్రభావంతో వ్యవహరిస్తున్నవారు లేక మరే ఇతర సైద్ధాంతిక దృక్పథం కలిగినవారైనా సరే ఈ రాజ్యాంగాన్ని వెనక్కు నెట్టడాన్ని మనం ఎన్నటికీ అనుమతించకూడదు. ఒక దశలో నేను కూడా రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య రద్దు కోసం పనిచేస్తున్న వామపక్ష భావజాల శక్తుల్లో భాగంగా ఉండేవాడిని. అయితే చాలా త్వరగానే నేను వాస్తవం గుర్తించి, 'నేను హిందువు నెట్లయిత' పుస్తకాన్ని రచించిన 1980లలోనే, అలాంటి వామపక్ష శక్తులనుంచి బయటపడ్డాను. అందుకు నేను చాలా అదృష్టవంతుడిని. ఆ విధంగా రాజకీయ స్వీయ విధ్వంసక సైద్ధాంతిక క్రమం నుంచి నేను బయటపడ్డాను. అమెరికన్ రాజ్యాంగం వందల సంవత్సరాలుగా పనిచేస్తున్న విధంగా భారత రాజ్యాంగం కూడా నిరవధికంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగంపై కేసీఆర్ అభిప్రాయాలను తెలంగాణ ప్రజలు మొత్తంగా తిరస్కరించినందుకూ, ప్రతిపక్ష పార్టీలు, సామాజిక సంస్థలు అలాంటి ఆలోచననే ఖండించినందుకూ నేనెంతో సంతోషపడుతున్నాను.

# పోరాటాల పురిటిగడ్డ ఇది!

వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఉరికంబం ఎక్కి నేటికి 175 ఏళ్లు. 19వ శతాబ్దం ప్రారం భంలో అంకురించిన చిత్తూరు పాలెగాళ్ళ పోరాటం దగ్గర నుంచి 1847 ఫిబ్రవరి 22న పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని బ్రిటిష్‌వాళ్లు ఉరితీయడం వరకు... రాయలసీమ పోరాటాలతో ఎరుపెక్కింది. ఈ పోరాటాలలో ఉరికంబం ఎక్కిన అమరవీరులు రాయలసీమ పాలెగాళ్ళు. బ్రిటిష్ మహావృక్షాన్ని మొక్క దశలోనే తుంచేయాలని పోరాటాలు చేసిన తొలి స్వతంత్ర పోరాట యోధులు వీరు. క్రీ.శ. 1801 నుంచి 1805 వరకు చిత్తూరు జిల్లా పాలెగాళ్ళు బ్రిటిష్ వారికి మధ్య జరిగిన పోరాటంలో... యాదరాకొండ పాలెగాడు ముద్దు రామప్ప నాయుణ్ణి పట్టుకుని కల్లయ్య బండ అడవుల్లో ఉరితీశారు. మిగిలిన పాల్యాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆనాటి బ్రిటిష్ సైనిక చట్టం ప్రకారం చిత్తూరు పాలెగాళ్లను కొందరిని ద్వీపాంతరం పంపారు. మరికొందరిని ఉరితీశారు. క్రీ.శ.1600– 1800 వరకు రాయలసీమలో బలమైన రాజుల పాలన లేదు. రాయలసీమను రక్షించినది పాలెగాళ్లే. సీమలో దండయాత్రలు జరిగినప్పుడు గండికోట, సిద్ధవటం కోట, పరాయి రాజుల వశమైనప్పటికీ... బురుజులు మాత్రం పాలెగాళ్ళ ఆధీనంలోనే ఉండేవి. విజయనగరం రాజుల కాలంలోనే (క్రీ.శ.1336 –1680) పాలెగాళ్ల వ్యవస్థ ఏర్పడింది. రాయలసీమలో పాలెగాళ్లు విజయనగర రాజులకు పన్నులు వసూలు చేయడంలోనూ, అంతర్గత రక్షణ కల్పించడంలోనూ, అవసరమైన సైన్యాన్ని సమీకరించడంలోనూ సహాయపడేవారు. క్రీ.శ.1565లో జరిగిన తళ్ళికోట యుద్ధంలో సుల్తానుల చేతుల్లో పరాజయం పొందిన విజయనగరం రాజులు తమ రాజధానిని హంపీ నుంచి ప్రస్తుత అనంతపురం జిల్లాలోని పెనుగొండకు క్రీ.శ.1591లో మార్చారు. అప్పటి నుంచి 1800 సంవత్సరంలో బ్రిటిష్‌వారికి రాయలసీమ ప్రాంతం ధారాదత్తం అయ్యేదాకా ఇక్కడ ముప్పై యుద్ధాలు జరిగాయి. ఈ యుద్ధాల న్నిటిలో సీమ ప్రజలకు ధన, మాన, ప్రాణ, నష్టం జరగకుండా చూసింది పాలెగాళ్లే. క్రీ.శ. 1800 నాటికి రాయలసీమలో 80 మంది పాలెగాళ్ళు ఉండేవారు. వీరి కింద 30,000 మంది సైనికులు ఉండేవారు. రాయలసీమ ప్రాంతం బ్రిటిష్ వాళ్లకిందికి వచ్చిన తర్వాత పాలెగాళ్లు నామమాత్రులయ్యారు. బ్రిటిష్ వారి దోపిడీ పతాకస్థాయికి చేరుతుండటంతో పాలెగాడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి



ఐదు వేలమంది సాయుధులతో, ఇతర పాలెగాళ్లు, జమీందారుల సహకారంతో వాళ్లపై 1846లో తిరుగుబాటును ప్రారంభించాడు. అనేక సంఘర్షణల అనంతరం 1846 అక్టోబర్ 6న నరసింహారెడ్డిని బ్రిటిష్‌వాళ్లు పట్టుకున్నారు. 200 మంది అనుచరులతో రెడ్డి ఎర్రమల కొండలను వదిలి పెరసోమలలోనికి పోయినట్లు అనుమానించి పెరసోమల గ్రామం వద్ద బ్రిటిష్‌వాళ్లు ఆయన్ని చుట్టుముట్టి పట్టుకున్నారు. ఉయ్యాలవాడను చివరకు 1847 ఫిబ్రవరి 22న ఉరితీశారు. దీనిని కలెక్టర్ కాన్‌క్రేన్ పర్యవేక్షించాడు. మృతదేహం తలను నరికించి... ఆ తలను కోయిలకుంట్ల బురుజుకు వేలాడదీయించాడు. అలా 1847 నుంచి 1877 వరకు కోయిలకుంట్ల బురుజుకు ఆయన తల వేలాడుతూనే ఉంది.

# రాళ్ళ వాగును మింగేస్తున్నారు...

**వాగులో మట్టి నింపి, సిమెంట్ కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టి.. రాళ్ళు వాగును ఆక్రమించి ఆపై శ్వాస్వత హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అదికారులు మొద్దు నిద్రలో ఉంటే అక్రమార్కులు కోట్ల విలువైన భూములు కొల్లగొట్టు తున్నారు.**



మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 21, ప్రజాపాలన : మంచిర్యాల జిల్లాలో భూమి చాలా పిరెమై పోయింది. గతంలో వేలల్లో ఉన్న భూమి దరలు ఇప్పుడు లక్షల లో పలుకడంతో రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోతుంది . ఇదే భూ అక్రమార్కుల పాలిట వరంగా మారింది. రాళ్ళ వాగు అనుకుని ఉన్న స్థలాలని కొనుగోలు చేసి వాగును కలుపుకుని మరింత భూమిని సృష్టించిన కొందరు ప్లాంట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు. భూమి విలువ కోట్లలో ఉండటంవలన సహాకరించిన అదికారులకు సైతం బారీగానే ముట్టజెప్పుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**ఆక్రమదారుల చేతుల్లో కోట్లు విలువచేసే భూములు**

జిల్లా నడి బొడ్డున, మంచిర్యాల మండలం, మంచిర్యాల శివారు లోని బై పాస్ రోడ్డు ను అనుకొని రాళ్ళ వాగు వరకు ఉన్న సర్వే నెంబర్ 199,194.. లతో పాటు మరికొన్ని సర్వే నెంబర్లలో రాళ్ళ వాగు సరిహద్దుల్లో ఆక్రమించుకుని వాగులో మట్టి నింపుతూ, సిమెంట్ కాంక్రీట్ నిర్మాణాలతో శ్వాస్వత సరిహద్దు ఏర్పాటు చేసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈలా ఆక్రమించుకుంటున్న భూమి విలువ కోట్ల రూపాయల విలువ చేసే అవకాశం ఉన్నందున ఈ అక్రమ దందా వెనక పెద్దతలకాయలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. కొందరు అధికారులు, రాజకీయ నాయకులు కలిసి ఈ భూములకు పూర్వపు తేదీలలో పత్రాలు సృష్టించి ప్రజలకూ ముప్పై వేల నుంచి నలబై వేల లు ఒక్క గజం భూమి అమ్మ జూపుతూ లాభాలలో వాటాలు వెనుకుంటున్నట్లు సమాచారం.

**వాగులో గుడికట్టి సరిహద్దు గా మార్చారట**

వర్షాలు కురిసి ఉదృతం ప్రవహించే రాళ్ళవాగు గతంలో పెద్ద పెద్ద కట్టడాలను , వంతెనను సైతం వరదలో కలిపేసుకుని కొట్టకుకుపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ లాంటి ప్రమాదం పోంచి ఉన్న నేపథ్యంలో అవేమీ పట్టించుకోకుండా వాగును ఆక్రమించుకుని దేవాలయాలు , సత్రాలు నిర్మించారనే ఆరోపనలు వస్తున్నాయి. వాగులో గుడిని నిర్మించి దానినే సరిహద్దు గా చేసుకుని రాళ్ళ వాగులో రాళ్ళు రప్పలువేసి సరిహద్దు లు పెంచుకుంటున్నారని స్థానికులు పేర్కొన్నారు. ఈ సమస్యలు అదికారుల దృష్టికి తీసుకెళ్ళతే ఎవరికి వారు తమ వరిది కాదని తప్పించుకుంటున్నట్లు సమాచారం.

**అధికారులు స్పందించి అడ్డుకట్ట వేయాలి**

ఇప్పటికైని రాళ్ళవాగును కాపాడాల్సిన బాధ్యత అధికారుల పై ఉందని గుర్తించాలి. అక్రమణకు గురైపోతున్న వాగు ను రక్షించాలి. ముఖ్యంగా రాళ్ల వాగు పై సర్వే చేపట్టి, ఎఫ్ టి ఎల్, లెవెల్స్, బఫర్ జోన్ లను గుర్తించి వాగు ఆక్రమణ జరగకుండా హద్దు రాళ్ళు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా అన్యాక్రాంతం ఐన వాగు భూములు స్వాదీనం చేసుకోవాలని , భహుషత్తులో బారీ వర్షాలు కురిచి వరదల వలన ప్రజలు ఇబ్బందులు తలెత్తకుండా వాగు లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు తోలగించాలని స్థానికులు పేర్కొన్నారు. అదికారులు స్పందిస్తారో లేదో వేసి చూద్దాం...!

## శివాలయంలో ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి రంజిత్ రెడ్డి, విప్ గాంధీ, జగదీశ్వర్ గౌడ్



శేరిలింగంపల్లి- ప్రజా పాలన/ న్యూస్ :మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖనమేట్,ఇజత్ నగర్ గ్రామంలో నూతనంగా శివాలయం నిర్మించి శివలింగాన్ని,గణపతి,కుమారస్వామి,ధ్వజం నగదేవత ప్రతిష్టపన మహొత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించాన చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు డాక్టర్.జి.రంజిత్ రెడ్డి , ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ,మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్ ,మియపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ,మాదాపూర్ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ పాల్గొని శివాలయ కమిటీ వారిని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ గౌస్,బలరాం,కృష్ణ,రంజిత్ రెడ్డి యువ సేన అధ్యక్షులు ఆశీల శివ కుమార్,ఆశీల శ్యామ్,గ్రామ సభ్యులు శ్యామ్,లోకేష్,బస్తి అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## వైఎస్ఆర్ టిపి జెండాను ప్రతి గ్రామంలో ఆవిష్కరించాలి

**జిల్లా వైఎస్ఆర్ టిపి మహిళా కన్వీనర్ పి.సుధారాణి**



వికారాబాద్ బ్యూరో 21 ఫిబ్రవరి ప్రజాపాలన : వైఎస్ఆర్ టిపి జెండాను ప్రతి గ్రామంలో ఆవిష్కరించాలని జిల్లా వైఎస్ఆర్ టిపి మహిళా కన్వీనర్ పి.సుధారాణి పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ లోని లోటస్ పాండ్ లో వైఎస్ఆర్ టిపి వ్యవస్థాపకురాలు షర్మిల అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కన్వీనర్ పి.సుధారాణి మాట్లాడుతూ వైఎస్ఆర్ టిపికి చెందిన నియమాలు నిబంధనలు తుచ తప్పకుండా అనుసరించాలని సూచించారు. పార్టీ అధినాయకత్వం అప్పగించిన ప్రతి పనిని శక్తివంచన లేకుండా పని చేయాలని హితవు పలికారు. కార్యకర్తలు అందరూ ఐకమత్యంతో సమన్వయంతో పార్టీ శ్రేయస్సు కొరకు కృషి చేయాలని ఆకాంక్షించారు. టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్య పరచాలని కోరారు. మహిళా కార్యకర్తలకు ఎల్లప్పుడూ నేను అందుబాటులో ఉంటానని తెలిపారు. ఏ సమస్య వచ్చినా వెంటనే నా దృష్టికి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు మండల అధ్యక్షురాలు మణెమ్మ, పరిగి నిర్మల లక్ష్మి బాలమ్మ రవి కొత్తూరు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీజీవీబీ అంబేద్కర్ సెంటర్ బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత సదస్సు పై అవగాహన



మధిర: ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధిమధిర ఏపీజీవీబీ అంబేద్కర్ సెంటర్ బ్రాంచ్ వారు సోమవారం నాడు టీ వీ ఎం స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు బ్యాంకు యొక్క లావాదేవీలు మరియు , ఆర్థిక అక్షరాస్యత సదస్సు ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు అలాగే ఈ ప్రోగ్రాం వల్ల ఇన్సూరెన్స్ పాలసీలు మరియు అకౌంట్స్ సంబంధించిన విషయాలను తెలియజేశారు ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ జి. రాజేష్ మరియు క్యాషియర్ ఉదయ్ కిరణ్, స్టాప్ లక్ష్మి , ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## ఆశా కార్యకర్తలకు సెల్ ఫోన్లు పంపిణీ



మధిర: ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధిమధిర మండలం లోని మాటూరుపేట పి హెచ్సి డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు నేడు మధిర మండలంలో ఉన్న 64 మంది ఆశ కార్యకర్తలకు జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు చేతుల మీదగా మాటూరుపేట పి. హెచ్.సి ఆసుపత్రి నందు ప్రభుత్వం అందించే సెల్ ఫోన్లు పంపిణీ చేయటం జరిగింది.

## ఉప్పల్లో జాకీ ఎక్స్ క్లూజివ్ బ్రాండ్ స్టోర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి మేయర్ వెంకట్ రెడ్డి



వేడిపల్లి, ఫిబ్రవరి 21 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉప్పల్ ప్రధాన రహదారిలో బస్టాండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జాకీ ఎక్స్ క్లూజివ్ బ్రాండ్ స్టోర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి హాజరై స్థానిక కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పి. కృష్ణ, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డం రవి కుమార్, గరిక సుధాకర్, ఉప్పల్ డివిజన్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేముల సంతోష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మస్కా సుధాకర్, చింతల నరసింహారెడ్డి, స్వీట్ హౌస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలకు సెల్ ఫోన్లు పంపిణీ



మధిర ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధి: మధిర మండలం లోని మాటూరుపేట పి హెచ్సి డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మధిర మండలంలో ఉన్న 64 మంది ఆశ కార్యకర్తలకు జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు చేతుల మీదగా మాటూరుపేట పి. హెచ్.సి ఆసుపత్రి నందు ప్రభుత్వం అందించే సెల్ ఫోన్లు పంపిణీ చేయటం జరిగింది జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు. అనంతరం ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేసే పనులకు ప్రజలకుమేలు చేసే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం తీసుకునే ప్రతి సంక్షేమ ఫలాలు ప్రజలకు నేరుగా చేరాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి ఇ ఎంపీపీ లత ఆత్మ కమిటీ చైర్మన్ కోటేశ్వరావుగ్రామ సర్పంచ్ మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వరావు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## మాతృభాష తెలుగును ఎవరు మరువద్దు: భేరీ రామచందర్ యాదవ్



శేరిలింగంపల్లి -ప్రజాపాలన /న్యూస్ :అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా శ్రీ భేరీ వెంకటమ్మ వెంకటయ్య యాదవ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మిట్ట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకా లు స్టడీ మెటీరియల్స్ పంపిణీ పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ.. మాతృ భాష యొక్క మాధుర్యం, గొప్పదనం ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలియజేయాలని అన్నారు. వారు పరభాషలలో ఒక భాషగా ఎంచుకున్నా పూర్తిగా అదే భాష కు బానిస కాకుండా తెలుగు మీద పట్టు పెంచుకోవాలి అని అన్నారు. నా మాతృభాష తెలుగు నవరస మనోహరమైనదని, సుమధురమైనదని అన్నారు. తెలుగు వ్యాకరణం లోని అంశాలు సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, పద్యాలు అద్భుతాలు అన్నారు. ప్రతి తెలుగు వాడు తెలుగు భాష మీద పట్టు పెంచుకొని ఖండ ఖండాంతరాలకు అన్నింటికీ రుచి చూపించాల్సిన కమ్మనైన భాష మనది అని అన్నారు. ప్రపంచ భాషలందు తెలుగు లెస్స అని అన్నారు. పిల్లలకు పాశ్చాత్య భాషలపై మోహన్ని తగ్గించి మన భాషపై మమకారం పెంపొందిస్తే మన బంధాలు, బంధుత్వాలు, విలువలు, సంస్కృతి, సాంప్రదాయాలు వాటంతట అవే నిలబడతాయి అన్నారు. మన తెలుగు భాష మనకు అమ్మ లాంటిదని దయచేసి ఈ విషయాన్ని మరువద్దని అన్నారు రామచంద్ర యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన చాంద్ బేగంకు ఘన సన్మానం



మధిర ఫిబ్రవరి 21 ప్రజాపాలన ప్రతినిధి మధిర మండలం మాటూరుగ్రామం 317 జి ఒ అమలులో భాగంగా మాటూర్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్ గా పని చేసినటువంటి శ్రీమతి మహ్మద్ చాంద్ బేగం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు ఘన సన్మానం చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమ%శీ%లో ముఖ్య అతిధిగా విచ్చేసిన మధిర మండల విద్యాశాఖ అధికారి శ్రీ వై ప్రభాకర్ మాట్లాడుతూ అతి తక్కువ సమయంలోనే మాటూర్ విద్యార్థులలో మాణిక్యాలను తయారుచేసి వివిధ రకాల అవార్డులకు ఎంపిక అయ్యేలా తీర్చిదిద్దుతూ, విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించేలా విశేషకృషి చేసిన చాంద్ బేగం మన జిల్లా నుంచి దూరం కావడం మన దురదృష్టం, అదేవిదంగా భద్రాద్రి జిల్లా అదృష్టంగా పేర్కొంటూ వారి సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ దీవి సాయికృష్ణమాచార్యులు మాట్లాడుతూ చాంద్ బేగం తను చక్కని బోధన చేయటమే కాక నాటక రంగంలో విద్యార్థులను చక్కగా తీర్చి దిద్దుతూ బహుమతులు పొందేలా కృషి చేసిన బేగం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక కావడం జరిగిందని తెలుపుతూ ఇలాంటి సేవలు మున్ముందు కూడా కొనసాగాలని కోరుతూ అహర్నిశలు విద్యార్థుల శ్రేయస్సు కోసం కృషి చేసిన చాంద్ బేగం మాటూర్ విద్యార్థుల మనస్సులో చిరస్థాయిగా మిగిలిపోతారని ప్రశంశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేడిశెట్టి లీలావతి, ఎంపీటీసీ అడపాల వెంకటేశ్వర్లు, పాఠశాల విద్యాకమిటి చైర్మన్ మేడిశెట్టి రామకృష్ణారావు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా బీరుపూర్ శ్రీ లక్ష్మీనరసింహా స్వామి రథోత్సవ మహొత్సవం



బీరుపూర్, ఫిబ్రవరి 21 (ప్రజాపాలన ప్రతినిధి): బీరుపూర్ శ్రీ లక్ష్మీనరసింహా స్వామి జాతరలో భాగంగా సోమవారం రోజున సాయంత్రం స్వామివారి రథోత్సవం అంగారంగా వైభవంగా జరిగింది. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి కొబ్బరికాయలు పసుపు కుంకుమలు పట్టేనామలు కోరమీసాలు గండదీపం నూనె పూలు పండ్లతో మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్ జడ్పీటీసీ పాత పద్మారమేష్ వైస్ ఎంపీపీ భాలుమురి లక్ష్మణ్ రావు ఆలయ ఛైర్మన్ నెరేళ్ల సుమన్ గౌడ్ ఈవో కాంతారెడ్డి స్థానిక సర్పంచ్ గర్షకుర్తి శిల్పారమేష్ ముప్పాల రామచందర్ రావుకొలుముల రమణ అధికారులు నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు ధర్మకర్తలు భక్తులు పాల్గొన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీసులు సీఐ కృష్ణ కుమార్ ఎస్ఐ గౌతమ్ 8 మంది ఎస్సైలు 40 కానిస్టేబుళ్లు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## బోనకల్ మండలంలో పర్యటించిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు



బోనకల్ ,ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధి: బోనకల్ మండలం లో పలు గ్రామాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పర్యటించినారు. మొదటిగా చిరునోముల గ్రామం లో టిఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు (పి ఎ) నాయనమ్మ ఇటీవల మరణించడం తో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికీ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఆళ్లపాడు గ్రామం లో రమేష్ రమ్య కుమార్తె ఒనీల అలంకరణ వేడుకకు హాజరై చిన్నరిని దీవించారు. ఈ కార్యక్రమం లో బోనకల్ మండల టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత గ్రామాల ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి గోడ పత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



సారంగాపూర్, ఫిబ్రవరి 21 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ మండల్ పెంబట్ల కొనాపూర్ శ్రీ దుబ్బ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డా: సంజయ్ కుమార్ గారినీ క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను ఆలయ ధర్మకర్తలు అందజేశారు. అనంతరం శ్రీ దుబ్బరాజన్న 2022 సంవత్సర నూతన క్యాలెండర్ ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల్ కన్వీనర్ కోల శ్రీనివాస్ వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్ వ్యవస్థాపక ధర్మకర్త పోరండ్ల శంకరయ్య ఈవో కాంతారెడ్డి ఎంపీటీసీ జోగినపల్లి సుధాకర్ రావు తోడిటి శేఖర్ గౌడ్ నరేష్ శ్రీనివాస్ నారాయణ జయశ్రీ కవిత గోపాల్ కిషన్ లచ్చం పాక్స్ చైర్మన్ మల్లారెడ్డి సర్పంచ్ రమణరావు తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టులకు ప్రభుత్వం మొండి చెయ్యి..!

## జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు,డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి..

## సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో వర్కింగ్ జర్నలిస్టు లందరికీ సభ్యత్వాలు ఇవ్వాలి

## తెలంగాణా జర్నలిస్ట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బాపురెడ్డి

సిద్ధిపేట(ప్రజాపాలన ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సమాజ హితం కోసం రేయనక, పగలనక పనిచేస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వం మొండిచేయి చూపిస్తుందని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు చింతలపల్లి బాపురెడ్డి విమర్శించారు.ఆయన సోమవారం సిద్ధిపేటలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం జర్నలిస్టులకు ఇస్తున్న హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని,పని చేసే ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం లేదంటే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరారు.విధి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టులకు 5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇస్తూ ఆ కుటుంబానికి నెలకు రూ. 5,000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిస్టులు పడ్డ బాధలు వర్ణనాతీతమని అన్నారు.తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో జర్నలిస్టులు ముఖ్య పాత్ర వహించారని గుర్తు చేశారు.తెలంగాణ ప్రభుత్వం ఏర్పడితే కష్టాలు దూరమవుతాయని సంబర పడ్డ జర్నలిస్టులకు నిరాశే ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు.కరోనా కష్టకాలంలో మొక్కవోని ధైర్యంతో జర్నలిస్టులు తమ వంతు విధులు నిర్వహించారని కొనియాడారు.కరోనా మహమ్మారి వ్యాధి మూలంగా జర్నలిస్టులు ప్రాణాలు వదిలినా ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.సమాజంలో మంచి



చెడులను,రాజకీయాలను ప్రజలు ముందుంచుతున్న జర్నలిస్టులపై వివక్ష తగదన్నారు.చిన్న పెద్ద జర్నలిస్ట్ అనే తారతమ్యం లేకుండా జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు,హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రత్యేక దృష్టి సారించి జర్నలిస్టులకు స్థలంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని సీఎం కేసీఆర్ చెప్పిన మాటలకు కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు.వృత్తి ధర్మంలో పార్టీలకు అతీతంగా జర్నలిస్టుల పని చేయాలే తప్ప ఏ ఒక్క పార్టీ మెప్పు పొందడానికి పని చేయవద్దని సూచించారు. కొన్నేళ్లుగా సభ్యత్వాలు ఇవ్వకుండా సహచర జర్నలిస్ట్ ల పట్ల వివక్ష చూపుతున్న... సిద్ధిపేట ప్రెస్ క్లబ్ లో అందరికీ సభ్యత్వం కల్పించాలన్నారు. జర్నలిస్టులలో సీనియర్లు,జూనియర్లు అనే భేదం మంచిది కాదన్నారు.జర్నలిస్టులు అందరూ ఐకమత్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారానికి కదం తొక్కాలని పిలుపునిచ్చారు.ఇకనైనా ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి వెంటనే ఇళ్ల స్థలాల తోపాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని బాపురెడ్డి డిమాండ్ చేశారు..

### కేసీఆర్ పర్యటనపై అనేక అనుమానాలు: బీజేపీ నేత

హైదరాబాద్: కేసీఆర్ ముంబయ్ పర్యటనపై అనేక అనుమానాలు కలుగుతున్నాయని బీజేపీ సీనియర్ నేత ఎన్వీఎస్ఎస్ అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా అన్ని నియోజకవర్గాల్లో పోటీచేయాలని ఎంఐఎంకు సవాల్ విసిరారు. మహరాష్ట్ర సీఎంతో జరిగిన చర్చల వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ మొదట తెలంగాణ రాష్ట్రాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేయాలన్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి..శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా తీసినందునే పదే పదే ఎఫ్ఆర్బీఎం పరిధిని పెంచమని కోరుతున్నారని వ్యాఖ్యానించారు. గాడి తప్పిన కేసీఆర్ ఆర్థిక విధానాలతో తెలంగాణ సతమతమవుతోందన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలను ప్రభుత్వం చాలా తేలిగ్గా తీసుకోవటం సరైంది కాదన్నారు. ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవటానికే కేసీఆర్ టూర్లు వెళ్తున్నారని చెప్పారు.

### రాబోయే వర్షాకాలంలో దృష్టిలో పెట్టుకొని నాల పనులను పూర్తి చేయాలి: విప్ గాంధీ

**జోనల్ కమిషనర్ ప్రియాంక అలా ఐ ఏ ఎస్**



శేరిలింగంపల్లి -ప్రజా పాలన /న్యూస్ :డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీ నగర్ నాల విస్తరణ లో భాగంగా అసంపూర్తిగా మిగిలిపోయిన నాల విస్తరణ పనులను జోనల్ కమిషనర్ ప్రియాంక అలా ఐ ఏ ఎస్ , జీహెచ్ఎంసీ అధికారులు మరియు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ.. రాబోయే వర్షకాలం ను దృష్టిలో పెట్టుకొని నాలాల విస్తరణ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. కరోనా వంటి విపతర్క పరిస్థితుల్లో అభివృద్ధి,సంక్షేమం అగకూడదనే ఉదేశ్యం తో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని,అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడకుండా పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చేస్తున్నామని,అదేవిధంగా రాబోయే వర్షకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజా అవసరాల దృష్ట్యా నాలా విస్తరణ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని,నాల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని,నాణ్యత విషయంలో రాజీ పడకుడదని పనుల లో వేగం పెంచాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడలని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు.నాలా నిర్మాణ పనుల పై పలు సూచనలు,సలహాలు ఇవ్వడం జరిగినది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతలు ,నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఇబ్బంది కల్గకుండా సన్నద్ధం కావాలని,ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముంపుకు గురికాకండా ముందస్తుగా తగు చర్యలు తీసుకోని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, అధికారులు సమన్వయం తో పని చేసి పనులలో పురోగతి సాధించాలని ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ అధికారులు ఈఈ శ్రీకాంతిని , చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి , తెరాస నాయకులు నాయి నేని చంద్రకాంత్ రావు అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

### మొబైల్ యాప్ లో సెన్సెస్ నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్**



వికారాబాద్ బ్యూరో 21 ఫిబ్రవరి ప్రజాపాలన : 2021 సంవత్సరంలో నిర్వహించాల్సిన జనాభా గణన (సెన్సెస్) పనులు కరోనా కారణంగా ఆలస్యం అయినందున ఇట్టి పనులను పూర్తి శ్రద్ధతో పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరములో ఏర్పాటు చేసిన జనాభా గణన ముందస్తు సన్నాహక సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, స్టాటిస్టికల్ అధికారులతో జనాభా గణన నిర్వహణపై అయన మాట్లాడుతూ, ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జనాభా గణన (సెన్సెస్) కార్యక్రమం గత 2011 తరువాత ఇప్పటి వరకు నిర్వహించబడలేదని, 2021 కు సంభందించిన జనాభా గణన నిర్వహించవలసి ఉందన్నారు. అధికారులు పాత అనుభవంతో పారదర్శకంగా ఏలాంటి తప్పులు దొర్లకుండా ఇన్యూమరేటర్ల ద్వారా పక్కడబందిగా పనులు చేపట్టాలని సూచించారు. 2014 లో తెలంగాణ కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత దానితో పాటు కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు, మున్సిపాలిటీలు, గ్రామాలు ఏర్పడినందున వాటికి అనుగుణంగా సెన్సెస్ నిర్వహించాలని తెలిపారు. గతంలో నిర్వహించిన అనుభవం మేరకు నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం జనాభా గణన పూర్తి బాధ్యతతో నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర గణన శాఖ ఉప సంచాలకులు సుబ్బరాజు సెన్సెస్ నిర్వహణపై తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్ లు, స్టాటిష్టికల్ అధికారులకు జనాభా గణనపై పవర్ ప్రెసెంటేషన్ ద్వారా అవగాహన కల్గించారు. ఈ సమావేశంలో సీపీవో నిరంజన్ రావు , తాండూర్ ఆర్డిఓ అశోక్ కుమార్, కేంద్ర గణాంక శాఖ జిల్లా సెన్సెస్ ఇంచార్జి అధికారి నాయుడు, అన్ని మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్య తెలంగాణే కెసిఆర్ లక్ష్యం: సర్పంచ్ కోట విజయశాంతి వెంకట కృష్ణ



మధిర ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధి మధిర మండలం దెందుకూరు గ్రామంలో సోమవారం నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు సమగ్ర ఆరోగ్యసేవలు అందించి సమగ్ర సమాచార నిమిత్తం ఉపయోగపడే విధంగా జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల ఆశ కార్యకర్తలకు అందవలసిన స్మార్ట్ ఫోన్ లను పిహెచ్సి దెందుకూరు పరిధిలోని దెందుకూరు సబ్ సెంటర్ ఎఎన్ఎమ్ లకు డా వెంకటేష్ డా శశిదర్ సూచనలు మేరకు దెందుకూరు సర్పంచ్ శ్రీ మతి కోట విజయశాంతి వెంకటకృష్ణ చేతులు మీద గా పిహెచ్సి దెందుకూరు నందు సోమవారం మధ్యాహ్నం ఆశ కార్యకర్తలకు అందించినారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ్ శాంతి మాట్లాడుతూ ఆరోగ్యతెలంగాణగా మార్చటమే కెసిఆర్ కె టీ ఆర్ లక్ష్యం అని అందుకోసం మారుమూల ప్రాంతంలో ప్రతి ఒక్క రికి సంపూర్ణ ఆరోగ్య సేవలు అందించి ప్రతి వ్య క్తి ఆరోగ్య వివరాలు మొబైల్ ఫోన్ ద్వారా సమగ్ర సమాచారం సేకరణ నిమిత్తం ఉపయోగనిమిత్తం వాడాలని ఆమె తెలిపినారు. ఈ కార్యక్రమం లో పిహెచ్సి పబ్లిక్ హెల్త్ నర్స్ రమాదేవి మతా శిశు సమరక్షణ నోడల్ అధికారి మరియు హెల్త్ విజిటర్ %దీ% కౌ సెల్య ఆశ నోడల్ పర్సన్ %జ% విజయకుమారి హెల్త్ సూపర్ వైజర్ లంకా కొండయ్య ఎఎన్ఎమ్ లు భారతి జయమ్మ వై లక్ష్మి ఎఎన్ఎమ్ లు రాజేశ్వరి విజయ్ లక్ష్మి విజయ్ కుమారి నాగమణి రాజేశ్వరి దెందుకు రు మొదటి ఎఎన్ఎమ్ %దీ% ఆ రు ణ మరియు సునీలా రాణి హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరావు స్టాఫ్ నర్స్ లు రజని సృజనా వినీల పాల్గొన్నారు.

### ఉప్పల్లో ఆర్టీసీ బస్ టెర్మినల్ పనులను ప్రారంభించాలని బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ



మేడిపల్లి, ఫిబ్రవరి 21 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉప్పల్లో బస్ టెర్మినల్ అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మహంకాళి దేవాలయం నుండి ఏసియన్ థియేటర్ వరకు భారీ నిరసన ర్యాలీని చేపట్టారు. అభివృద్ధికి నోచుకోని బస్ స్టాప్ వద్ద టీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తన హాయంలో జరిగిన ఎలివేటెడ్ కారిడార్ మరియు అనేక పనులు గాలికి వదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే పై మండిపడ్డారు. ఇలాగే వ్యవహారశైలి మారకపోతే మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చేతన, బండారు శ్రీవాణి, ఉప్పల్, చిలకా నగర్ బీజేపీ అధ్యక్షులు రెడ్డిగారి దేవేందర్ రెడ్డి,గోనె శ్రీకాంత్ ముదిరాజ్ మరియు ఉప్పల్ సర్కిల్ బీజేపీ సీనియర్ నాయకులు మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్,సోమశేకర్ గౌడ్,రేవు నర్సింహా,కల్యాణం గీత రాణీ, గోనె అంజయ్య, కొల్లు బాలరాజ్ కురుమ, మేకల శిల్పా రెడ్డి,రెవెల్లి రాజు,ఏసురి యాదగిరి, మర్నేని ఫణీంద్ర,వెంకట్ రెడ్డి, బండి పద్మా, సింగారం కార్తీక్, రవీందర్ రెడ్డి, వర్కల రాజేందర్ గౌడ్,సంగీ స్వామి యాదవ్,తెలంగాణ సంపత్, నాని గౌడ్, బూత్కురి రాజేష్ గౌడ్, నామ శ్రవణ్, నవీన్ గౌడ్, రిషికేశ్,దయ్యాల అమరెందర్, శ్రీనివాస్ ముదిరాజ్, లాఖాన్, దత్త సాయి వివిధ మోర్చా నాయకులు, రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### హఫీజ్ పేట్ డివిజన్ మౌళికవసతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: పూజిత జగదీశ్వర్ గౌడ్



శేర్లింగంపల్లి- ప్రజా పాలన /న్యూస్ : హఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ,బస్తీలో ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించడమే ప్రధాన ద్యేయంగా ముందుకు సాగుతున్నామని,ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని,డివిజన్ పరిధిలో మంజూరైన అభివృధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేల కృషి చేస్తామని తెలిపారు హఫీజ్ పేట్ డివిజన్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్ . హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్ నందు నూతనంగా చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజ పనులను మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్ మరియు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు ఈ కార్యక్రమంలో హఫీజ్ పెట్ డివిజన్ టిఆర్ఎస్ గౌరవ అధ్యక్షులు వాలా హరీష్ రావు,నాయకులు యాదగిరి ముదిరాజ్,సుబ్బు,ఉమామహేశ్వరరావు, విష్ణు, విజయ్ కుమార్,నాగేశ్వర్ రావు, రవి చందర్, మోహన్,వీరాజు,, శ్రీనివాస్ గౌడ్,వెంకట్ రెడ్డి, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

### శ్రీ సద్గురు సేవాలాల్ మహరాజ్ 283వ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



జగిత్యాల, ఫిబ్రవరి, 21 ( ప్రజాపాలన ప్రతినిధి ): జగిత్యాల జిల్లా కేంద్రం బంజారా భవన్ లో శ్రీ సద్గురు సేవాలాల్ మహరాజ్ 283వ జయంతి ఉత్సవాలు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ సేవలాల్ మహారాజ్ చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని శాంతి, ప్రేమ, అహింస వంటి మంచి మార్గంలో ప్రతి ఒక్కరూ పాటించి సమాజంలో ఆదర్శంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షు ప్రొ. నునావత్ దేవదాస్ నాయక్ మాట్లాడుతూ బంజారాలు వారి మాతృ భాష, సంస్కృతి సంప్రదాయం మర్చిపోకూడదని, మరియు ప్రభుత్వాలు బంజార లంబాడీల సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేయాలని కోరారు. ఓట్లు వేయించుకుని లంబాడీలను విస్మరించకూడదు అన్నారు. గిరిజన రిజర్వేషన్ పెంచి ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వాలు పాటుపడాలని అన్నారు. వద్దే లింగాపూర్ మండల కేంద్రంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేశ్, కలెక్టర్ రవి నాయక్, గ్రంథాలయ చైర్మన్ చంద్ర శేఖర్ గౌడ్, జిల్లా డి టి ఓ శ్యామ్ నాయక్, రాయికల్ ఎంపీపీ సంధ్యారాణి, జడ్పీటీసీ అశ్వని జాదవ్, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు నాయకులు మరియు బంజారా ప్రజలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 868810293 |
| రత్నకిషోర్ నంద్రు | ఎర్రుపాలెం | 8142196692 |
| సి.మల్లేష్ | ఇబ్రహీపట్నం | 9618028334 |
| భుక్య శ్రీను | బోనకల్ | 86881020885 |
| సాయికృష్ణ | వైరా | 9951486635 |
| పి.పండు | చేవేళ్ల | 9963293635 |
| గొల్లపూడి దశరధన్ | జిల్లేడు, చౌదరిగూడ | 9951334682 |
| పుప్పాల కిరణ్ కుమార్ | రాజేంద్రనగర్ | 9666603538 |

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎస్.రాములు

## ఉన్నత పాఠశాల

ఆ నల్లకోటు మా ఇంట్లో ఎంత సంక్షోభం సృష్టిస్తుందో ముద్దు రామకృష్ణయ్యకు తెలిసి ఉండదు. అలాగే పదో తరగతిలో పదిహేను రూపాయలు ల్యాబ్ డిపాజిట్ తప్పనిసరి కట్టాలని నిబంధన వల్ల అది కట్టలేక నా జీవితమే మారిపోయింది. ముద్దు రామకృష్ణయ్య యేటా వేసవి సెలవుల్లో రెండు బస్సుల నిండా 150 మందికి పైగా విద్యార్థులను దక్షిణ భారత, ఉత్తర భారత యాత్రలకు ప్రణాళికలు వేసేవారు. 150 రూపాయలు కడితే నెలంతా విజ్ఞానయాత్ర చేయవచ్చు. చాలామందికి సగం ఫీజులు ముద్దు రామకృష్ణయ్య తన జీతంలోంచి కట్టేవాడు. భీమనాతి ప్రభాకర్, దాసరి రామస్వామి తదితర మిత్రులు ఈ ప్రయోజనం పొందారు. ముప్పై రూపాయలు కట్టి ఇక లేవన్నవారికి కూడా ముద్దు రామకృష్ణయ్య తన జీతం నుంచి కట్టేవాడు. కానీ పదిహేను రూపాయల ల్యాబ్ డిపాజిటే కట్టలేని నాలాంటివాళ్ళు 30 రూపాయలు మాత్రం కట్టడం ఎలా సాధ్యం. అందువల్ల ముద్దు రామకృష్ణయ్య ఎంత త్యాగం చేసినా వాటి ఫలాలు మాలాంటి పేదలకు అందలేకపోయాయి. అసలు ఆయనను కలిసి ఇలా కన్‌సెషన్ గురించి మాట్లాడే ధైర్యం ఉండేది కాదు.

ముద్దు రామకృష్ణయ్య స్కూల్లో స్విమ్మింగ్‌పూల్ కట్టించాలని పూనుకున్నాడు. విద్యార్థులు పనిచేసుకుని సంపాదించాలని, తన అనుభవాలను చెప్తూ, కంకర కొట్టి, సంపాదించుకోమని చెప్పాడు. అలా బేస్‌మెంట్ రాళ్ళను చిన్న కంకరగా కొట్టి ఎంతోమంది చారానా, ఆఠానా చొప్పున సంపాదించారు. నేను కూడా కొద్దిరోజులు కంకర కొట్టాను. కంకర అటూ ఇటూ ఎగిరిపోకుండా ఒక చుట్టలో పెట్టి ఒక చేత్తో పట్టుకొని, మరో చేత్తో కంకర కట్టాల్సి వచ్చేది. దాంతో అప్పుడప్పుడు సుత్తె వేళ్ళమీద పడి వేళ్ళు చితికిపోయేవి. కంకర చిల్లి దెబ్బలు తాకేవి. మరోవైపు గ్రౌండ్‌లో వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ, తీన్‌కూటి, బాస్కెట్‌బాల్, కబడ్డీ ఆడుకుంటూ ఉంటే మేం కంకర కొట్టుకుంటూ కూచోవాలా? అని అనిపించేది. దాంతో కంకర కొట్టడం కొనసాగించలేదు.

మొత్తంగా ముద్దురామకృష్ణయ్య సంకల్పం నెరవేరింది. స్విమ్మింగ్‌పూల్ కట్టించాడు. బావినీళ్ళతో స్విమ్మింగ్‌పూల్ నిండింది. సుమారు తొమ్మిది ఫీట్ల లోతుతో స్విమ్మింగ్‌పూల్ నీళ్ళు ఆకాశం రంగులో స్వచ్ఛమైన నీరు మెరుస్తూ ఉండేది. అలా స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టడం, స్నానం చేయడం కొంత కాలం చేశాను. అది ఎంత ఆహ్లాదకరంగా ఉండేదో!.

మా ఇంటివద్ద రెండు తుమ్మచెట్లు ఉండేవి. ఆ తుమ్మలకు ఎక్కువ ముండ్లు ఉండేవి కావు. కొమ్మలు నూనె పూసినట్టు నునుపుగా ఉండేవి. తుమ్మ చెట్టుకు బంక కారేది. అది మంచి బలం అని చూయింగ్ గమ్ములాగా నములుకుంటూ తినేవాళ్ళం. చెట్టు ఎక్కి ఒక్కొక్క ముల్లు విరిసేసుకుంటూ కొమ్మల్లోకి వెళ్ళి ఒక కొబ్బరి తాడు బిగించాము. కొబ్బరితాడుకు రింగులు కట్టి ఊగేవాళ్ళం. దండిలు తీసేవాళ్ళం. అలా ఊగితే పొడుగు పెరుగుతారని అనేవాళు ్ళ. కండ పెరుగుతుందని చెప్పేవాళ్ళు. అలా చాలాకాలం తుమ్మచెట్టుకు రింగులు ఊగేవాళ్ళం. మా చుట్టూ ఉన్న విద్యార్థులే కాకుండా, వాళ్ళ మిత్రులు కూడా రింగులు ఊగడానికి వచ్చేవాళ్ళు.

కొందరు బొమ్మలు వేయడం ప్రాక్టీస్ చేశారు. కాసర్ల శంకర్ మిట్టపెల్లి ఖాదీ రమేష్, మానపురి రాజనర్సయ్య, టి. రాజిరెడ్డి వంటివాళ్ళు చక్కగా బొమ్మలు వేసేవారు. నేను కూడా దేశ పటాలకు సంబంధించిన బొమ్మలు వేసేవాడిని, ఎక్కువగా కుదరలేదు. నేను పాటలు పాడే ప్రయత్నం చేస్తే కొందరు హేళన చేశారు. నవ్వారు. నా ఉత్సాహం అడుగంటిపోయింది. వచ్చే పాట కూడా రాకుండా పోయింది.

అప్పుడప్పుడే మా సీనియర్లు 'నా హృదయంలో నిదురించే చెలీ... కలలలోన కవ్వించే సఖి... మయూరివై... వయ్యారివై... రావే' అంటూ పాటలు పాడేవాళ్ళు. కొందరు దేశభక్తి గీతాలు పాడేవారు. కొందరు హిందీ సినిమా పాటలు పాడేవాళ్ళు. స్కూల్లో కోరుట్ల నుంచి వచ్చిన గణేష్ హిందీ పాటలు అద్భుతంగా పాడేవాడు. నా క్లాస్‌మేట్ గాంధీనగర్‌కు చెందిన రాజనర్సయ్య పాటలు అద్భుతంగా పాడేవాడు. వి. రమాకాంత్ కూడా చక్కగా పాడేవాడు. రమాకాంత్‌తో కలిసి పాట పాడాలని ప్రాక్టీసు చేశాను.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

## ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కౌన్సిలర్ కట్టా గాంధీ



మధిర ఫిబ్రవ21 ప్రజాపాలన ప్రతినిధి మధిర మున్సిపాలిటీ పరిధి22 వ వార్డు లో ఉన్న సమస్యలపై వార్డ్ కౌన్సిలర్ కట్టా గాంధీ ఆధ్వర్యంలో లో సోమవారంం నాడు పలు సమస్యలపై వార్డులో ఉ న్న ప్రజలతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెగ్యులర్నప్రభుత్వ స్థలాల్లో 2014 జూన్ 2 కి ముందు నివాసాలు ఏర్పాటు చేసుకొని దారిద్ర దిగువ రేఖకు దిగువున ఉన్న పేదల నివాసాలను క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని 22 వ వార్డు కౌన్సిలర్ కట్టా గాంధీ కోరారు. సోమవారం వార్డులోని మార్కెట్ యార్డ్ రోడ్లో అనేక సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టా గాంధీ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్న పేదలు తమ నివాసాలను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు మీసేవ ద్వారా నేటినుండి మార్చి 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరంం ప్రజలతో తాగునీటి సమస్య డ్రైనేజీ వ్యవస్థ పెండింగ్లో ఉన్న సమస్యలపై అతి త్వరలోనే పరిష్కారమవుతాయని వారు తెలిపారు వార్డులో సమస్యల పై నేన్ను ఉన్నంతకాలం వార్డులో ఉన్న సమస్యలన్నీ త్వరలో కలిసొస్తాయని వారు తెలిపారు సమస్యల పరిష్కారం కొరకు నిర్ణయంతో తీసుకుంటా అను అన్నందుకు ప్రజలు వార్డ్ కౌన్సిలర్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయకుడి గుడిలో రవి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం



మధిర ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధి : మధిర మున్సిపాలిటీ పరిధి లో మెయిన్ రోడ్ లో గల వినాయకుడి గుడి దగ్గర ఆదివారం నాడు పరస గ్రూప్ అధినేత పబ్బతిరవి జన్మదినాన్ని పురస్కరించుకొని వినాయకుడి గుడి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినారు అనంతరం ఈ సందర్భంగా వారి మిత్రబృందం మాట్లాడుతూ రవి పుట్టినరోజు సందర్భంగా ఆయన నిండు నూరేళ్ళు ఆయుష్షు ఆరోగ్యంతో ఉండాలని మనసా వాచా కోరుతూ రవి అనేక సేవా కార్యక్రమంలో అనేక దేవాలయాల్లో అన్నదానానికి సహకరిస్తూ పేద ప్రజల అనేకమందికి ఆయన ఆయన సహకరిస్తూ ప్రజల మన్ననలు పొందుతూ వారు వారి కుటుంబం ఆరోగ్యంతో ఇలాంటి పుట్టినరోజు వేడుకలు ఎన్నో చేసుకోవాలని ఆ భగవంతున్ని ఆ సాయినాధుని కోరుతూ మధిర నియోజకవర్గ ప్రజల తరఫున శుభాకాంక్షలు అభినందనలు తెలుపుతున్నారు ఈ కార్యక్రమంలో లో వారి మిత్రబృందం రంగా హనుమంతరావు, కోన వెంకట రమణ ,కోన దని కుమార్, కోన లక్ష్మీ మోహన రావు పాల్గొన్నారు.

## మధిర మండలంలో లో పలు కార్యక్రమాలు హాజరైన జడ్ చైర్మన్ లింగాల



మధిర ఫిబ్రవరి 21 ప్రజా పాలన ప్రతినిధిమధిర మండలం పరిధిలో సోమవారం నాడు పలు కార్యక్రమాల్లో భాగంగా రామచంద్రపురం రొంపి మల్ల వంగవీడు గ్రామాలలో పర్యటించిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మొదటిగా రామచంద్రపురం గ్రామంలో నూతనంగా మంజూరైన సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారులిఅనంతరం రొంపిమల్ల గ్రామంలో నూతనంగా మంజూరైన సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారుఅనంతరం వంగవీడు గ్రామంలో మిర్చీ కోసే వ్యవసాయ కూలీ రైతులతో యోగక్షేమాలు అడిగి ముచ్చటించారుఅనంతరం వంగవీడు గ్రామంలో సి సి రోడ్డు శంకుస్థాపన వెళ్లిన జిల్లా పరిషత్ చైర్మన్ గారికి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో యువత బ్రహ్మరథం పట్టారు, అనంతరం గ్రామంలో నూతనంగా మంజూరైన సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మధిర మండల టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు ఎకరానికి కోటి ఇచ్చే వరకు పోరాటం ఆగదు, సిపిఐ నేత భాగం



ఖమ్మం :ఖమ్మం టూ దేవరపల్లి పో గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణం జిల్లా భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు ఎకరానికి కోటి రూపాయలు నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు , తెలంగాణ రాష్ట్ర సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావులు ప్రభుత్వాలను డిమాండ్ చేశార . సోమవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ , బొంతు రాంబాబు , నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన భూ నిర్వాసితుల ఎకరానికి కోటి పరిహారం ఇవ్వాలని జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు . మూడు పంటలు పండే వ్యవసాయ భూములు ను తక్కువ ధరకు ఇవ్వాలని జిల్లా అధికారులు ఒత్తిడి చేయటం సరైంది కాదని , వ్యవసాయ భూమిని జీవించే రైతులను రోడ్డున పడవద్దని వారు హెచ్చరించారు . భూమి కింద భూమి వచ్చే విధంగా పరిహారం ఇచ్చేపోరాటం నిరంతరం కొనసాగిందని తెలిపారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు , తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాదినేని రమేష్ , రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మరిదు నాగేశ్వరావు , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం , టిడిపి రాష్ట్ర నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు , భూ నిర్వాసితుల కమిటీ కన్వీనర్ దొబ్బల వెంగల్ రావు , నున్నసత్యానారాయణ ఉదరపు వెంకటేశ్వర్లు , ఎస్ కెమీ రాసాహెబ్ , కొల్లు శ్రీనివాసరావు , బాలస్వామి తాళ్లపల్లి కృష్ణ , పొట్ట బత్తిని సరస్వతి పాల్గొన్నారు .

## ప్రజా సమస్యల పరిష్కార లక్ష్యమే ప్రజావాణి: జిల్లా కలెక్టర్ నిఖిల



వికారాబాద్ బ్యూరో 21 ఫిబ్రవరి ప్రజాపాలన : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ప్రజావాణికి వచ్చే సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిఖిల జిల్లా లోని తహసీల్దార్లను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 213 మంది ధరణి సమస్యలకు దరఖాస్తులను కలెక్టర్ నిఖిల స్వీకరించారు. ప్రజల నుండి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు తహసీల్దార్లను ఆదేశించారు. ఇందులో అత్యధికంగా ధరణికి సంబంధించిన దరఖాస్తులు కాగా వీటిని ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత తహసీల్దార్ లను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్, తాండూర్ ఆర్డిఓ లు విజయకుమారి, అశోక్ కుమార్, కలెక్టరేట్ ఏ ఓ హరిత అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నిలయంగా మడుపల్లి రోడ్డు



మధిర ఫిబ్రవరి 21 ప్రజా పాలనప్రతినిధిమధిర మున్సిపాలిటీ పరిధిలో నిత్యం రద్దీగా ఉన్న రోడ్లో పెనుగంచిప్రోలు వెళ్ళే దారి మడిపల్లి గ్రామం మధిర నుండి మడుపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలతో తయారయింది దీనివల్ల ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి కానీ ఎవరు పట్టించుకోవట్లేదు కనీసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్తంభాలకు వీధిలైట్లు కూడా లేకపోవటం ప్రమాదకరంగా మారింది కావున అధికారులు స్పందించి ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేయవలసిందిగా ప్రజలు కోరుకుంటున్నారు

### నేడు ఎలిమినేడు భూ బాధితుల సమస్యలు తెలుసుకోడానికి బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి రాక

ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 20 ప్రజాపాలన ప్రతినిధి : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు కు 21 రోజు అనగా సోమవారం ఉదయం 10:30నిముషాలకు ఎలిమినేడు రైతుల సమస్యలు తెలుసుకోడానికి బిసి కమిషన్ మెంబెర్ తల్లోజు ఆచారి రావడం జరుగుతుంది. కాబట్టి రైతులు ఎవ్వరి సమస్యలు వారు చెప్పుకోవొచ్చు అందరు కూడా ఎవ్వరి భూమి పేపర్లు వాళ్ళు జిరాక్స్ తీసుకోని రావాలి అని ఎలిమినేడు భూ బాధితుల కమిటీ అధ్యక్షుడు తెలిపారు.

## ఎస్ ఆర్ ఠాగూర్ లోని దూర విద్యా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కోఆర్డినేటర్....



వైరా ప్రజలపాలన ప్రతినిధి : స్థానిక ఠాగూర్ విద్యా సంస్థ లోని ఇంటర్ దూర విద్యా కేంద్రాన్ని జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సందర్శించి విద్యార్థులతో మాట్లాడి తగు సూచనలు చేశారు దూర విద్యా కేంద్రం ద్వారా విద్యార్థులకు వచ్చే సర్టిఫికెట్స్ రెగ్యులర్విద్యార్థులకు వచ్చే సర్టిఫికెట్ తో సమానం అని తెలిపారు చదువు మానేసిన వారి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున దూరవిద్య కేంద్రాలను నిర్వహిస్తుందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రవికుమార్ చైర్మన్ సంక్రాంతి సునీత అసిస్టెంట్ కోఆర్డినేటర్ చింత నిప్పుకృష్ణారావు నాగలక్ష్మి లింగారావు విద్యార్థులు పాల్గొన్నారు

## స్వయం ఉపాధి పొందుతూ ఉద్యోగావకాశాలు

### వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్





వికారాబాద్ బ్యూరో 21 ఫిబ్రవరి ప్రజాపాలన : స్వయం ఉపాధి పొందుతూ ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కొనియాడారు. సోమవారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ జిల్లా కేంద్రంలో న్యాయవాది పిల్లికండ్ల ఆనంద్ నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వకేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయ సేవలు అందించేటప్పుడు తరతమ భేదాలు చూపకుండా సమన్యాయం చేయాలని సూచించారు. న్యాయవాది పిల్లికండ్ల ఆనంద్ మాట్లాడుతూ సేవా దృక్పథమే ప్రాధాన్యతగా భావిస్తానని పేర్కొన్నారు. సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కొరకు అహర్నిశలు న్యాయ సహాయం అందిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



మేడిపల్లి, ఫిబ్రవరి 21 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కలను లబ్ధిదారులు రామంతపూర్ డివిజన్ కు చెందిన పి. అనిల్ కుమార్ 60,000/- మహేశ్వర్ 60,000/- ఫాతిమా మింజా 28,000/- అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డం రవి కుమార్, గరిక సుధాకర్ ,రామంతపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎండీ ముస్తాక్ ,నాచారం డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మేకల ముత్యం రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేముల సంతోష్ రెడ్డి, అశోక్ ,రత్నాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మేకవనంపల్లిలో బీరప్ప జాతర ఉత్సవాలు

### సర్పంచ్ పట్లోళ్ళ శశిధర్ రెడ్డి





వికారాబాద్ బ్యూరో 21 ఫిబ్రవరి ప్రజాపాలన : గ్రామానికి ఏ అరిష్టం ఆపద రాకుండా చల్లగా చూడాలని గ్రామ దేవతలను ప్రజలు భక్తిప్రవత్తులతో కొలుస్తారని మేకవనంపల్లి సర్పంచ్ పట్లోళ్ళ శశిధర్ రెడ్డి అన్నారు. సోమవారం మోమిన్ పేట్ మండల పరిధిలోని మేకవనంపల్లి గ్రామంలో బీరప్ప జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పాడిపంటలు, పశుసంపద వృద్ధి చెందేందుకు గ్రామ దేవతల ఆశీస్సులు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించేలా రక్షణ కవచంగా ఉండి గ్రామ దేవతలు కాపాడుతారని ప్రజల ప్రగాఢ విశ్వాసమని స్పష్టం చేశారు. గ్రామ దేవతలను ప్రసన్నం చేసేందుకు బోనాలు తీసి ప్రత్యేక నైవేద్యం అర్పించి మొక్కులు చెల్లింపు చేసుకుంటారని వివరించారు. పలు చీడపీడల నుండి ప్రజలను, పశువులను రక్షించి కరుణాకటాక్షలు ప్రసరింపజేస్తారని ప్రజల తరతరాల విశ్వాసం అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బి.విజయ్ కుమార్, మేకవనంపల్లి పిఏసిఎస్ చైర్మన్ పట్లోళ్ళ అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రావణి, ఎంపిటిసి గోవర్ధన్ రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షుడు కాస్లవాద మల్లేశం, కారోబార్ కుమ్మరి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లికి ముందే రకుల్-జాకీ ఏడడుగులు!



రకుల్ ప్రీత్ సింగ్-జాకీ భగ్నానీ ప్రేమలో మునిగితేలుతోన్న సంగతి తెలిసిందే. మొదట్లో చాటు మాటు వ్యవహారాలు నెరిపినా తర్వాత రివీల్ కాక తప్పలేదు. ప్రస్తుతం ఇద్దరు లివ్ ఇన్ రిలేషన్ లో ఉన్నారు. ప్రేమ జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. ఖాళీ సమయం దొరికితే విదేశాలు చెక్కేస్తున్నారు. అదీ కుదరకపోతే భారత్ లోనే విహార యాత్రల్ని ప్లాన్ చేస్తున్నారు. ఇటీవలే జంటగా మాల్దీవుల అందాల్ని ఆస్వాదించి వచ్చారు. తాజాగా ఆగ్రా కోటల్ని చుట్టేస్తున్నారు. అయితే ఈసారి ప్రేమికులుగా సహచరుల పెళ్లికి జంట అతిధులుగా హాజరయ్యారు. బాలీవుడ్ దర్శకుడు లూ రాంజాన్స్ – అలీ వేదిల వివాహం ఫిబ్రవరి లో 20న ఆగ్రాలోని ఫ్లష్ హోటల్ లో నిరాడంబరంగా జరిగింది. ఈ సందర్భంగా జంట ఆహ్వానం మేర కు రకుల్ –జాకీ కూడా జంటగానే హాజరయ్యారు. ఇద్దరూ వైట్ అండ్ వైట్ డిజైనర్ దుస్తుల్లో కొత్త జంటని తలపిస్తు న్నారు. ఒకరి చేయి ఒకరు పట్టుకుని నడుస్తున్న ఓ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. ఆ ఫోటో చూసిన నెటి జనులు పెళ్లికి ముందే జంటగా ఒకరి వేలు మరొకరు పట్టుకుని ఏడు అడుగులు వేసేసాం ´ంటూ కామెంట్లు పెడుతున్నారు. ప్రేమికుల్లా కాకుండా పెళ్లైన కొత్త జంటగా హాజరైనట్లు ఉందని అంటున్నారు. ఇలా వైట్ అండ్ వైట్ ధరించడం డ్రెస్ కోడ్ లా కనిపిస్తోంది. ఆ పక్కనే మరో మహిళ కూడా తెలుపు రంగు డిజైన్ దుస్తుల్లో కనిపిస్తున్నారు. ఆ కారణంగానే మ్యారేజ్ డ్రెస్ కోడ్ లా కనిపిస్తోంది. ఇక కెరీర్ పరంగా ఇద్దరు బిజీ గానే ఉన్నారు. రకుల్ నటిగా బిజీగా ఉంది. జాకీ హీరోగా కొన్ని సినిమాల్లో నటించాడు. కానీ సక్సెస్ కాలేదు. రెండేళ్లగా నటనకు దూరంగా ఉంటూ నిర్మాతగా బిజీ అయ్యాడు. ఇటీవల రిలీజ్ అయిన బెల్ బాటమ్ చిత్ర నిర్మాతల్లో జాకీ ఒకరు. ప్రస్తుతం బాలీవుడ్ లో ఐదారు సినిమాలు నిర్మిస్తున్నారు.

# నా కల .. నా ముందున్న లక్ష్యం అదే: అలియా భట్




బాలీవుడ్ భామల విషయానికి వస్తే అలియా భట్ 'పిట్టకొంచెం కూత ఘనం' అన్నట్టుగా కనిపిస్తుంది. తన పాత్రకి న్యాయం చేయడానికీ .. కొత్తగా కనిపించడానికి ఎంతమాత్రం వెనుకాడని స్వభావం ఆమె సొంతం. గ్లామర్ పరంగా .. నటన పరంగా తనకంటే మెరుగైన భామలు బాలీవుడ్ లో ఉన్నప్పటికీ అరుదైన అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఆమె మహా నేర్పరి అంటూ ఉంటారు. పాత్ర ఎలాంటిదైనా చాలా కాన్ఫిడెంట్ తో చేస్తూ ముందుకు వెళ్లడం ఆమె ప్రత్యేకతని చెబుతుంటారు. ఒక వైపున స్టార్ హీరోల సరసన అందాల సందడి చేస్తూనే మరో వైపున నాయిక ప్రధానమైన కథలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ వెళుతోంది. ఆమె తాజా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రావడానికి 'గంగూబాయి కథియావాడి' రెడీ అవుతోంది. ముంబై కామాటిపుర ప్రాంతానికి చెందిన ఒక వేశ్య కథ ఇది. ఈ పాత్రలో ఆమె అనేక వేరియేషన్స్ ను చూపించనుంది. అలాగే లుక్ పరంగా కూడా వైవిధ్యభరితంగా కనిపించనుంది. ఈ పాత్రలో తన బాడీ లాంగ్వేజ్ ను ఆమె మార్చుకున్న తీరు చూసి ఇప్పటికే చాలామంది షాక్ అవుతున్నారు. అంతగా ఆమె ఈ పాత్ర కోసం తనని తాను మార్చుకోవడం .. మలచుకోవడం కనిపిస్తోంది. ఈ నెల 25వ తేదీన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ లో అలియా చాలా బిజీగా ఉంది. తాను పోషించిన పాత్రను .. ఆ పాత్రలోని ప్రత్యేకతను .. అందుకోసం చేసిన సాధనను గురించి చెబుతూ ఈ సినిమాపై ఆసక్తిని .. అంచనాలను పెంచుతోంది. ఈ పాత్రలో తాను అంతగా ఇన్వాల్వ్ కావడానికి కారకురాలు శ్రీదేవి అంటూ ఆమె తాజా ఇంటర్వ్యూలో చెప్పింది. "శ్రీదేవి చాలా గొప్ప నటి .. ఒక వైపున గ్లామరస్ గా కనిపిస్తూనే మరో వైపున బరువైన పాత్రల్లోను అంతేలా మెప్పించడం ఆమెకి మాత్రమే సాధ్యమైంది. ఆమె ఏ పాత్రను పోషించినా ఏ మాత్రం ఆ గ్రేస్ తగ్గేది కాదు. శ్రీదేవి సినిమాలు ఎప్పుడు చూసినా .. ఎన్నిమార్లు చూసినా పాత్ర మాత్రమే తెరపై కనిపిస్తుంది. అలాగే ఆమె ఏ పాత్ర పోషించినా ఆ పాత్రపై తనదైన ముద్ర ఉంటుంది. అందుకే ఆమె పట్ల అభిమానం ఎవరిలోను ఎంతమాత్రం తగ్గలేదు. తెలుగు .. తమిళ .. హిందీ భాషల్లో తిరుగులేని స్టార్ హీరోయిన్ అనిపించుకోవడం మామూలు విషయం కాదు. అందుకే నేను ఏ పాత్రను పోషిస్తున్నా ఆమెనే స్ఫూర్తిగా తీసుకుంటాను. ఆమె మాదిరిగానే కష్టపడటానికి నా వంతు ప్రయత్నం చేస్తుంటాను. 'గంగూబాయి' సినిమా విషయంలోను అలాగే కష్టపడ్డాను. శ్రీదేవిలా పాన్ ఇండియా స్టార్ అనిపించుకోవడమే నా ముందున్న లక్ష్యం" అని ఆమె చెప్పుకొచ్చింది.

# రామ్ జోడీగా బాలీవుడ్ బ్యూటీని సెట్ చేసిన బోయపాటి!



బోయపాటి సినిమాల్లో భారీతనం ఉంటుంది .. భారీ తారాగణం ఉంటుంది .. మాస్ మసాలా అంశాలు ఉంటాయి. యూత్ ను ఆకట్టుకునే రొమాంటిక్ ట్రాక్ తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ ఆశించే డ్రామా ఉంటుంది. అందువలన ఆయన సినిమాలను అన్నివర్గాల ప్రేక్షకులు ఆదరిస్తుంటారు. ఇటీవల వచ్చిన 'అఖండ' అదే విషయాన్ని మరోసారి నిరూపించింది. ఈ సినిమాలో ఆయన యాక్షన్ కీ .. ఎమోషన్ కి మధ్య ఆధ్యాత్మికతను కూడా లింక్ చేయడంతో కాసుల వర్షం కురిసేసింది. అలాంటి బోయపాటి ఆ తరువాత సినిమాను ఎవరితో చేయనున్నాడనేది ఆసక్తికరంగా మారింది. ఆయన తన నెక్స్ట్ సినిమాను రామ్ తో చేయనున్నాడనే టాక్ వినిపించింది. అది నిజమేనంటూ ఈ కాంబినేషన్ నుంచి ఎనౌన్స్ మెంట్ వచ్చింది. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాస చిట్టూరి ఈ సినిమాకి నిర్మాతగా వ్యవహరించనున్నాడు. రామ్ కెరియర్ లోనే అత్యధిక భారీ బడ్జెట్ తో నిర్మితమవుతున్న సినిమా ఇది. తెలుగుతో పాటు తమిళ .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు ముందుగానే ప్రకటించారు. అంటే రామ్ కెరియర్లో ఫస్టు పాన్ ఇండియా సినిమాగా దీనిని గురించి చెప్పుకోవచ్చు. ఈ సినిమాలో కథానాయికగా ఎవరికి ఛాన్స్ దక్కనుందనేది ఆసక్తికరంగా మారింది. పాన్ ఇండియా సినిమా అనగానే బాలీవుడ్ లో మంచి క్రేజ్ ఉన్న భామలపైకే అందరి దృష్టి వెళుతుంది. అందుకు కారణం .. అటు దక్షిణాదిన మార్కెట్ చేసుకోవడం తేలిక అవుతుంది. సహజంగానే ఉత్తరాది భామలకు దక్షిణాదిన కూడా మంచి క్రేజ్ ఉంటుంది. అందువల్లనే బోయపాటి కూడా ఈ సినిమాకు బాలీవుడ్ బ్యూటీని తీసుకోవాలనే ఆలోచన చేస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. ఆల్రెడీ 'పరిణీతి చోప్రాను తీసుకున్నట్టుగా ప్రచారం కూడా జరుగుతోంది. బాలీవుడ్ లో పరిణీతికి మంచి ఫాలోయింగ్ ఉంది. గ్లామర్ పరంగా మంచి మార్కులు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ నాయిక ప్రధానమైన కథలతోను ఆకట్టుకుంది. ఆ సినిమాల జాబితాలో 'మేరీ ప్యారీ బిందు' .. 'ది గర్ల్ ఆన్ ది ట్రైన్' .. 'సైనా' సినిమాలు అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. శ్రద్ధా కపూర్ .. అలియా భట్ .. అనన్య పాండే మాదిరిగా పరిణితీ చోప్రా కూడా ఈ ఏడాది తెలుగు తెరకి పరిచయమవుతుందన్న మాట. ఇక రామ్ విషయానికి వస్తే లింగుసామి దర్శకత్వంలో ఆయన చేస్తున్న 'ది వారియర్' ముగింపు దశకి చేరుకుంది. ఈ ద్విభాషా చిత్రం షూటింగ్ పూర్తికాగానే బోయపాటితో కలిసి ఆయన సెట్స్ పైకి వెళతాడు.

# సురేష్ బాబు తగ్గేదేలే అంటున్నారా?



సురేష్ ప్రొడక్షన్స్ అధినేత సురేష్ బాబు నిర్మాతగా చాలా సెలక్టివ్ గా సినిమాలు నిర్మిస్తుంటారు. కాంబినేషన్ కంటే కంటెంట్ ని నమ్మి సినిమాలు చేసే నిర్మాతల్లో సురేష్ బాబుది ప్రత్యేకమైన స్థానం. గడిచిన మూడు నాలుగేళ్లగా సురేష్ బాబు సినిమాల గ్రాఫ్ పరిశీలిస్తే తన ఫ్యామిలీ హీరోలతోనే సినిమాలు నిర్మించినట్లు కనిపిస్తోంది. కోవిడ్ మొదలైన తర్వాత ఆ వేగం కూడా తగ్గింది. వెంకటేష్ హీరోగా నటించిన నారప్ప, దృశ్యం-2 చిత్రాల్ని నేరుగా ఓటీటీలోనే రిలీజ్ చేసారు. థియేటర్లో రిలీజ్ చేయాలని ఒత్తిడి ఎదురైనప్పటికీ వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా భవిష్యత్ సినిమా ఓటీటీదే అని ముందుకెళ్లిపోయారు. అటుపై ఏపీలో టిక్కెట్ ధరలు తగ్గడం.. టాలీవుడ్ ధపధపాలుగా సీఎం జగన్ మోహన్ రెడ్డి..మంత్రుల బృందంతో చర్చలు జరపడం వంటి పరిణామాల్ని సురేష్ బాబు ఓవైపు వాచ్ చేస్తూనే ఉన్నారు. ఈ భేటీల కు తొలి నుంచి సురేష్ బాబు దూరంగానే ఉన్నారు. వివాదం మొదలైన సమయంలో కల్పించుకున్నారు తప్పితే..అవి ముదిరే పరిస్థితిలో ఆయన పూర్తిగా దూరమయ్యారు. ఆ మధ్య డిస్ట్రిబ్యూటర్లు ఆందోళన చేసినప్పటికీ వాటిని పెద్దగా పట్టించుకోలేదు. మరి ఇలాంటి సన్నివేశాలు సురేష్ బాబు ఆలోచనలో మార్పులు తీసుకొచ్చాయా? అంటే అవుననే ప్రచారం సాగుతోంది. నిర్మాతగా సుదీర్ఘ ప్రస్థానం ఆయనది. దాదాపు మూడు దశాబ్ధాలుగా సినిమాలు నిర్మిస్తున్నారు. ఎంతో మంది హీరోలు..నిర్మాతలతో పనిచేసిన అనుభవం ఉంది. ఇక రాజకీయంగా సురేష్ బాబు..వెంకటేష్ ఏనాడు భాగమైంది లేదు. పరోక్షంగా ఏదైనా పార్టీకి మద్దతు ఇవ్వాలి తప్పితే ప్రత్యక్ష మద్దతు ఏనాడు లేదు. ప్రస్తుతం ఏపీలో చోటు చేసుకున్న పరిస్థితులు... ఇండస్ట్రీలో ముసురుకుంటోన్న వివాదాలు వాచ్ చేస్తోన్న సురేష్ బాబు ఇలాంటి వాటికి దూరంగా ఉండాలనుకున్నారో ఏమో! గానీ ఫిలిం ఛాంబర్ మీటింగ్ లు పెడుతున్నా...చిరంజీవి లాంటి ఉద్దండులు సీఎంని బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నా సురేష్ బాబు మాత్రం తగ్గేదేలే అంటూ తనపని తాను చూసుకుంటున్నారు. సురేష్ బాబు వైఖరి చూస్తుంటే ప్రభుత్వం మారే వరకూ ఆయన సినిమాలు కూడా నిర్మించేలా కనిపించడం లేదని ఫిలిం సర్కిల్స్ లో సైతం గుసగుస వినిపిస్తోంది. ఆయనది ఒకరి దగ్గర తగ్గే మనస్తత్వం కాదని అంటున్నారు. ఓటీటీ భవిష్యత్ ని ముందే అంచనా వేసిన సురేష్ బాబు ఓటీటీ వరల్డ్ టాలీవుడ్ లో లాంచ్ అయిన తర్వాతే సినిమా భవిష్యత్ ఓటీటీదే అని ఉద్ఘాటించిన మొట్ట మొదటి నిర్మాత సురేష్ బాబునే. టెక్నాలజీ పరంగా సురేష్ బాబు అప్ డేట్ గా ఉంటారు. ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని అందింపుచ్చుకోవాలని సహచరులకు చెబుతుంటారు. ఉన్న థియేటర్లు ఫంక్షన్ హాల్స్ గా మారుతోన్న తరుణంలో సురేష్ బాబు పూర్తిగా ఓటీటీ వైపు తమ సినిమాల్ని రిలీజ్ చేసే అవకాశం ఉందని తాజా సన్నివేశాల్ని బట్టి తెలుస్తోంది. ప్రస్తుతం సురేష్ బాబు ఓ కోరియన్ చిత్రాన్ని సుదీర్ వర్మ దర్శకత్వంలో రీమేక్ చేస్తున్నారు. శాకిని దాకిణి టైటిల్ తో రీమేక్ అవుతుంది. కానీ సినిమా అప్ డేట్స్ మాత్రం లేవు.

# ధమాకా'లో రాజ్ తరుణే నటిస్తున్నాడట?



మాస్ మహా రాజా రవితేజ ప్రస్తుతం గ్యాప్ లేకుండా వరుస సినిమాలు చేస్తూ.. ఈ క్రమంలో నక్కిన త్రినాధరావు దర్శకత్వంలో కామెడీ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ధమాకా చేస్తున్నాడు. అయితే, ఈ సినిమాలో ఓ కీలక పాత్ర ఉందని.. ఆ పాత్రలో యంగ్ హీరో రాజ్ తరుణ్ నటించబోతున్నాడని గతంలో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఆ పాత్రలో నిఖిల్ కనిపించబోతున్నాడు అని అన్నారు. కాగా తాజాగా ఈ పాత్రలో రాజ్ తరుణే కనిపించబోతున్నాడు అని తెలుస్తోంది. అయితే, ఈ వార్త పై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ప్రస్తుతానికి అయితే రాజ్ తరుణ్ హిట్ కోసం ఎదురు చూస్తున్నాడు. మరి ఈ సినిమాలో రాజ్ తరుణ్ నటిస్తే కెరీర్ కి ప్లస్ అవుతుంది. ఇక ఈ సినిమాలో రవితేజ కొత్తగా కనిపిస్తాడని తెలుస్తోంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో చేసిన 'క్రాక్' సినిమాతో రవితేజకు పూర్వవైభవం వచ్చింది. కాకపోతే రవితేజ ఖిలాడి సినిమాతో మళ్ళీ ఫ్లాప్ ట్రాక్ లోకి వచ్చాడు.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989